


ఎన్నికల్లో ఎర్ర డబ్బు

ఈ ఎన్నికల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎర్రచందనం డబ్బులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఐదేళ్లుగా విచ్చలవిడిగా సాగుతున్న స్మగ్లింగ్‌కు అండగా నిలబడ్డ అధికారపార్టీ నేతలకు నిధులు వరదలా పోగయ్యాయని తెలుస్తోంది. చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చంద్రగిరి, పీలేరు, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాల్లో ఓట్ల కోసం పంచుతున్న డబ్బులో అధికభాగం ఎర్రడబ్బే అని ప్రచారం జరుగుతోంది.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నాడు టీడీపీ హయాంలో ఉక్కుపాదం

నేడు వైసీపీ పాలనలో స్మగ్లర్లకు టికెట్లు



తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో యథేచ్ఛగా ఖర్చు పెడుతున్న వైసీపీ అభ్యర్థులు



చంద్రబాబు పాలనలో

దడదడలాడించిన టాస్క్‌ఫోర్స్

2013లో కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినా 2014లో చంద్రబాబు సీఎం కాగానే దాన్ని బలోపేతం చేశారు. స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రత్యేక జ్యూరిస్‌డిక్షన్, ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. బలగాల సంఖ్యను 200కు పెంచి అదనపు ఎస్పీ, డీఎస్పీలను నియమించారు. ఆయుధాలు, వాహనాలు సమకూర్చారు. సీనియర్ ఎస్పీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. శేషాచలంలో వాచ్‌టవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. ఇన్‌ఫార్మర్ వ్యవస్థ పటిష్ఠమైంది. నిరంతరం కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించారు. 2015 ఏప్రిల్ 7న శేషాచలం అడవుల్లోని చీగటీగల కోనలో టాస్క్‌ఫోర్స్ బలగాలకూ, స్మగ్లర్లకూ నడుమ పోరాటమే జరిగింది. పలువురు సిబ్బంది గాయపడ్డారు. టాస్క్‌ఫోర్స్ కాల్పుల్లో 20 మంది తమిళ స్మగ్లర్లు చనిపోయారు. ఈ ఘటనతో తమిళనాడు స్మగ్లర్లు శేషాచలంలోకి అడుగుపెట్టడం ఆగిపోయింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎక్కడెక్కడి స్మగ్లర్లనూ అరెస్టు చేశారు. ఆ క్రమంలో అంతర్జాతీయ సంబంధాలు కలిగిన కొమ్ములు తిరిగిన స్మగ్లర్ మార్కొండన్ లక్ష్మణ్‌ను చెన్నైలో అరెస్టు చేయడంతో దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఛిన్నాభిన్నమైంది. అతడు జైల్లో వుండగా అతడి తరఫున ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ రాకెట్ నడిపిన లక్ష్మణ్ భార్య మాజీ ఎయిర్ హోస్టెస్, మోడల్ సంగీతా ఛటర్జీతో సహా తమిళనాడు మహిళా స్మగ్లర్ జ్యోతి వంటి వారు సైతం చిత్తూరులో జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. కడప, చిత్తూరు జిల్లాల్లో పాతుకుపోయిన స్మగ్లర్లు రెడ్డి నారాయణ, భాస్కర్ నాయుడు, మహేష్ నాయుడు, ఎం.సీ.విజయానందరెడ్డి (ప్రస్తుత చిత్తూరు వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి) వంటి వారు కూడా పీడీ యాక్ట్ కింద సెంట్రల్ జైలు పాలయ్యారు. ఈ విషయంలో చంద్రబాబు తన మన అన్న వివక్ష చూపలేదు. చిత్తూరులో టీడీపీ ముఖ్యనేత వసంత్ నాయుడు సైతం పీడీ యాక్టు కింద అరెస్టయ్యారు.

వైసీపీ ప్రభుత్వంలో

ఎర్ర దొంగలకు పదవులు

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడంతో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. పేరుకు టాస్క్‌ఫోర్స్‌లో సిబ్బంది సంఖ్య 200 నుంచీ 350కి పెరిగినా కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ప్రభుత్వం నుంచీ సమీక్ష గానీ, ఒత్తిడి గానీ లేకపోవడంతో టాస్క్‌ఫోర్స్ నామమాత్రమైంది. ఇన్‌ఫార్మర్ల వ్యవస్థ నిర్వీర్యమైంది. కూంబింగ్ ఆపరేషన్లు ఆగిపోయాయి. చెక్‌పోస్టుల్లో తనిఖీల తీవ్రత తగ్గింది. దీంతో ఎర్రచందనం స్మగ్లర్లు కూలీలతో శేషాచలంలోనే శాశ్వతంగా తిష్ట వేశారు. వీరి ధాటికి శేషాచలం అడవుల్లో సరిహద్దుల నుంచీ 20 కిలోమీటర్ల లోపలికి ఎర్రచందనం చెట్టన్నవే కనిపించకుండా పోయింది. అడపాదడపా అడ్డుకునేందుకు యత్నించిన పోలీసు, అటవీ శాఖల సిబ్బందిపై స్మగ్లర్లు దాడులకు దిగుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6న పీలేరు నియోజకవర్గం కేవీపల్లి మండలంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా స్మగ్లర్లు వాహనంతో ఢీకొట్టగా గణేష్ అనే కానిస్టేబుల్ మరణించాడు. అదే సమయంలో వైసీపీ ముఖ్యనేతల అండదండలతో పీలేరు, చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో స్మగ్లర్లు అధికార పార్టీ నేతలుగా ఎదిగారు. పలువురు ప్రజాప్రతినిధులుగా మారారు. ఉదాహరణకు తిరుపతి రూరల్ మండలం సప్తగిరినగర్ పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఉన్న వైసీపీ నేత అశోక్‌కుమార్‌రెడ్డి గతంలో పీడీ యాక్టు కింద అరెస్టయ్యారు. అదే మండలం తిరుమలనగర్ సర్పంచ్‌గా ఉన్న వైసీపీ నేత శివశంకర్ రాజుపై కూడా గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. చిత్తూరులో అధికార పార్టీ ఎర్రచందనం స్మగ్లరుగా పీడీ యాక్టు కింద అరెస్టయిన విజయానందరెడ్డికి ప్రస్తుత ఎన్నికల్లో ఏకంగా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం దీనికి పరాకాష్ఠ.



2014లో పీడీ యాక్టు కింద అరెస్టయినప్పుడు చిత్తూరు పోలీసు స్టేషన్‌లో విజయానందరెడ్డి (ప్రస్తుత చిత్తూరు వైసీపీ అభ్యర్థి), భాస్కర్‌నాయుడు, రెడ్డినారాయణ, మహేష్ నాయుడు

అంకెలు చెబుతున్న నిజాలు!

ఏడాది	కేసులు	నిందితులు	దుంగలు	బరువు	వాహనాలు
2015	114	497	2993	78.275 టన్నులు	74
2016	146	482	3425	96.579 టన్నులు	76
2017	103	460	2471	68.204 టన్నులు	38
2018	122	268	1802	50.641 టన్నులు	54
2019	76	140	956	25.167 టన్నులు	37
2020	28	81	668	19.030 టన్నులు	26

గత టీడీపీ ప్రభుత్వంలోనూ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలోనూ టాస్క్‌ఫోర్స్ పనితీరు ఎలా వుండేదో కింది అంకెలే చెబుతున్నాయి. 2019 నుంచే టాస్క్‌ఫోర్స్ ప్రభావం నామమాత్రం కావడంతో అప్పటి నుంచీ కేసుల వివరాలు మీడియాకు వెల్లడించడం లేదు. పురోగతి ఏమీ లేదనడానికి అధికారులు పాటిస్తున్న గోప్యతే నిదర్శనం

2014కు మునుపు చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఎర్రచందనం వృక్షాల నరికివేత, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నేతల అండదండలతో స్మగ్లర్లు రెచ్చిపోయి వ్యవహరించారు. ఆ పార్టీ నేతలకు వాటాలిస్తూ రూ.కోట్లకు పడగలెత్తారు. 2014 తర్వాత ఎర్రచందనం స్మగ్లర్లలో 90 శాతం మంది వైసీపీకి అనుకూలంగా మారిపోయారు. అందుకు ప్రధాన కారణం ఎర్రచందనం మీద టీడీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం. పీడీ యాక్ట్, అరెస్టులు పెరగడంతో వీరికి రాజకీయ ఆశ్రయం అవసరం అయ్యింది. దాని ప్రభావం 2019 ఎన్నికల్లో కనిపించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎర్రచందనం స్మగ్లర్లు భారీ ఎత్తున వైసీపీ గెలుపు కోసం డబ్బు ఖర్చు పెట్టారు. జీడీనెల్లూరులో పార్టీ విజయానికి వంద శాతం ఖర్చు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అక్కడి అభ్యర్థిగా ఉండిన ప్రస్తుత డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తోనూ, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డితోనూ ఎర్రచందనం కేసుల్లో పీడీ యాక్ట్ కింద అరెస్టయిన విజయానందరెడ్డి సన్నిహితంగా మెలిగేవారు. చంద్రగిరి, చిత్తూరు, పీలేరు, తిరుపతి నియోజకవర్గాల్లో కూడా ఎర్రచందనం స్మగ్లర్లే వైసీపీ గెలుపు కోసం ఆర్థికంగా సహకరించారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఈ నియోజకవర్గాలకు తోడు వెంకటగిరి, శ్రీకాళహస్తిలో కూడా ఎర్రచందనం నిధులు అధికార పార్టీకి ప్రధాన ఆర్థిక వనరుగా మారిందన్న ప్రచారం జరుగుతోంది. ఆర్థిక దన్నుగా ఉన్నందునే స్మగ్లర్లు వైసీపీలో నాయకులుగా మారారు. ప్రస్తుతం చిత్తూరు అసెంబ్లీకి విజయానందరెడ్డి వైసీపీ అభ్యర్థిగానే బరిలోకి దిగారు.

జగనన్న పాలన ఘనత

కుప్పంలోనూ వెబ్ కాస్టింగ్

- ఇప్పటికే పుంగనూరు, పలమనేరులో అమలుకు నిర్ణయం
- అదనపు బలగాలు, ఎన్నికల సంఘం నిఘా

చిత్తూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లోని అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణలో ఎన్నికల జరపాలని ఈసీ ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా కుప్పంలోనూ దీన్ని అమలు చేస్తున్నట్లు శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ ప్రకటించారు. మంత్రి పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా వైసీపీ నాయకుల, పోలీసుల తీరు మారలేదు. వైసీపీ నాయకులేమో ప్రతిపక్షాల మీద దాడులు చేయడం, పోలీసులు బాధితులపైనే కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో పుంగనూరు నియోజకవర్గంలోని 265 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల నిర్వహణా తీరును వీడియో, ఆడియో ద్వారా రికార్డు చేస్తారు. ఎప్పటికప్పుడు ఈసీ పర్యవేక్షిస్తుంది. అలాగే పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులూ లేకపోయినా 288 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజక వర్గంపైనా అరాచకాలకు కేంద్ర బిందువుగా మారిన బడా నేత దృష్టి పెట్టడం.. ఓడిస్తానని ప్రకటించడం.. అందుకనుగుణంగా అక్కడ అధికార పార్టీ ఓటుకు రూ.5 వేలు పంపిణీ చేయడం తెలిసిందే. ఇదంతా గమనించిన ఈసీ ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా కుప్పంలో వెబ్ కాస్టింగ్‌కు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నియోజక వర్గంలోని 243 పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ అమలు కానుంది.

వెబ్ కాస్టింగ్ అంటే: పోలింగ్ రోజున కేంద్రం లోపలా, బయటా వీడియో, ఆడియో రికార్డ్ చేస్తారు. ఎన్నికల ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు లైవ్ వీక్షించే అవకాశముంది. ఈ ప్రాంతాల్లో కేంద్ర బలగాలూ అధికంగా మోహరిస్తాయి. నేతలు ఘర్షణలకు పాల్పడినా, రిగ్గింగ్‌కు ప్రయత్నించినా వెంటనే ఉన్నతాధికారులు అలర్ట్ అవుతారు. మరింత కట్టుదిట్టంగా రీపోలింగ్ నిర్వహిస్తారు. నేతలకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటారు.

పోలీసు స్టేషను వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



మాకెందుకు డబ్బివ్వవు

- కుప్పం మండలంలో వైసీపీని నిలదీసిన మహిళ
- ఆగ్రహంతో దాడి చేసిన సర్పంచి

కుప్పం, మే 10: కుప్పం మండలం జరుగు పంచాయతీ యనమనాశనపల్లెలో శుక్రవారం రాత్రి వైసీపీకి చెందిన సర్పంచి సురేశ్ ఓటర్లకు పంపకాలు చేపట్టారు. కొన్ని ఇళ్లలో ఇస్తూ, మరికొందరికి ఇవ్వలేదు. తమకు డబ్బు ఎందుకు ఇవ్వవు అంటూ ఒక మహిళ నిలదీశారు. అడిగేదానికి నువ్వెవరు అంటూ సర్పంచి ఆమెపై దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామస్తులంతా ఒక్కటై అతడిమీద తిరగబడ్డారు. భయపడ్డ సర్పంచి మాజీ వలంటీరు ఇంట్లోకి వెళ్లి గడియ వేసుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డబ్బు ఇవ్వకపోతే పోయాడుకానీ, దౌర్జన్యం చేయడం ఏమిటని గ్రామస్తులు పోలీసులను నిలదీశారు. సర్పంచిని వదిలే ప్రసక్తే లేదని భీష్మించారు. చివరికి పోలీసులు సర్పంచిని బయటకు పిలిపించి తమతో తీసుకెళ్లడానికి ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు సర్పంచిని వదిలేది లేదన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అప్పుడు చర్యలు తీసుకుంటామని చెప్పిన పోలీసులు, సర్పంచిని తమ వాహనంలో తీసుకెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గ్రామస్తులంతా మూకుమ్మడిగా కుప్పంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ధర్నా చేశారు. పోలీసులు వారికి సర్దిచెప్పి ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

లక్ష్మీపురంలో ఘర్షణ

కుప్పం పట్టణం లక్ష్మీపురంలో శుక్రవారం రాత్రి అధికార, ప్రతిపక్ష శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ప్రచారాల్లో భాగంగా ఎదురుపడ్డ ఇరుపార్టీల కార్యకర్తలు కవ్వించుకునే క్రమంలో ఘర్షణ జరిగింది. టీడీపీ, వైసీపీ కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.



నేటితో ప్రచారానికి తెర

- సాయంత్రం 6 గంటల వరకు అవకాశం
- ఇంటింటి ప్రచారానికి అనుమతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే 10: సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారానికి తెరపడనుంది. బహిరంగ సభలు, రోడ్‌షో తరహా ప్రచారం ముగిసినా, ఇంటింటి ప్రచారాలకు ఆదివారమూ అనుమతి ఉంది. మరిన్ని వివరాలను కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ శనివారం మీడియాకు వెల్లడించారు.

- **ఫిర్యాదుల కోసం:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌తో సహా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోని ఆర్వో కార్యాలయాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. ప్రజలు అక్కడ ఫిర్యాదు చేయొచ్చు. పోలింగ్ రోజున ఇబ్బందికర ఘటనలు జరిగితే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు.
- **పోలింగ్ రోజున జరిగేదిదే :** పోలింగ్ రోజు 13వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది ఉండాలి. 5:30 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలి. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. ఆ తర్వాత ఓటర్లు క్యూలో ఉంటే స్లిప్పులు అందిస్తారు.
- **బయటి ప్రాంతాల వారు వెళ్లిపోవాలి :** ఓటు హక్కు లేనివారు, ప్రచారాల కోసం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చినవారు శనివారం సాయంత్రంలోగా వెళ్లిపోవాలి. 6 గంటల తర్వాత నుంచి 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. బయటి వ్యక్తులను పంపించేయమని హోటళ్ల, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ వారికి పోలీసులు నోటీసులిచ్చారు.
- **4 వేల మంది బైండోవర్ :** జిల్లాలో 4 వేల మందిని పోలీసులు బైండోవర్ చేశారు. వారి నుంచి ముందస్తుగా రూ.4.50 లక్ష డిపాజిట్ చేసుకున్నారు. మరికొంతమంది రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సమయంలో వీరు ఇబ్బందులు సృష్టిస్తే కేసులు తప్పవు.
- **బయటి పోలీసులకే బాధ్యత:** తమిళనాడు, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పోలీసులు జిల్లాకు వచ్చారు. ఇప్పటికే కేంద్ర బలగాలు జిల్లాలో ఉన్నాయి. చెక్‌పోస్టులు పెంచేసి, తనిఖీలు విరివిగా చేస్తున్నారు. లోకల్ పోలీసు సిబ్బంది పార్టీలకు అనుకూలంగా వ్యవహరించవచ్చనే ఉద్దేశంతో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులకు ఆయా కేంద్రాల వద్ద బాధ్యతను అప్పగిస్తారు. లోకల్ పోలీసులు వారికి అసిస్ట్ మాత్రమే చేస్తారు.

నేటి రాత్రి 7 నుంచి 144 సెక్షన్ అమలు

చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం రాత్రి 7 నుంచి 14వ తేదీ రాత్రి 7 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ సభలు నిషేధించామని, గుంపులుగా వెళ్లడానికి అనుమతి లేదని, పోలింగ్ కేంద్రాల సమీపంలో లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తిరుపతి				
2. శ్రీకాళహస్తి				
3. సత్యవేడు				
4. గంగాధర నెల్లూరు				
5. చంద్రగిరి				
6. పీలేరు				
7. మదనపల్లె				
8. తంబళ్ళపల్లె				
9. పుంగనూరు				
10. పలమనేరు				
11. కుప్పం				
12. చిత్తూరు				
13. పూతలపట్టు				
14. నగరి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం, సర్వే నెం. 717 బి/5, తూకివాకం గ్రామం & పోస్టు, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా - 517520, ఆం.ప్ర.

సతీమణీయం **బొట్టుపెట్టి.. ఓటు అడిగి!**



కంగుందిలో ప్రచారం చేస్తున్న కలై సెల్వి

కుప్పం, మే 10: ఇప్పుడంతా ఇల్లాళ్లదే రాజ్యం. ఇల్లు, భూమి, పథకం.. అన్నీ వారివే. చివరకు భర్తల తరఫున, కొడుకుల తరఫున ఓట్లు అభ్యర్థించే బాధ్యత కూడా వారే తీసేసుకుంటున్నారు. మొన్నటికి మొన్న నారా భువనేశ్వరి స్వయంగా కుప్పంలో రెండు రోజులు పర్యటించి భర్త చంద్రబాబు తరఫున ఓట్లను అభ్యర్థించి వెళారు. రెండు రోజులపాటు మూడు మండలాల్లో రోడ్ షోలలో పాల్గొని పగలనకగా, రాత్రనకా గ్రామాలు తిరిగి గ్రామాలను చుట్టేశారు. ఇప్పుడు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం సతీమణి కలై సెల్వి వంతు వచ్చింది. ఆమె ఎన్నడూ ఇల్లు విడిచి బయటకు రాని ఆమె, శుక్రవారం నాడు కంగుంది పంచాయతీలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఒక తాంబూళం ప్లేట్లో పసుపు, కుంకుమ తీసుకెళ్లి, ముత్తైదువలకు బొట్టుపెట్టి మరీ చంద్రబాబుకు ఓటేయమని అభ్యర్థించారు. ఇన్నాళ్లూ పీఎస్.మునిరత్నం ప్రచారం చేయడమే తప్ప ఆయన సతీమణి ప్రచారాన్ని చూడని మహిళలు పలువురు, అభిమానంతో ఆమెవెంట ప్రచారంలో పాల్గొన్నారు.

ముస్లిం కమ్యూనిటీలో ఎన్డీయే కూటమిపై దుష్ప్రచారం

● టీడీపీ ఆరోపణ

కుప్పం, మే 10: ఒక ఒక్క రోజు మాత్రమే ప్రచారానికి సమయం మిగిలింది. మిగిలిన తికొద్ది సాధ్యమైనంత మేర వినియోగించుకోవడానికి అధికార పార్టీ అనేక దారులు వెదకుతోంది. ఇందులో భాగంగా కుప్పంలో మతకలహాలు రేగేలా వైసీపీ మసీదులో ప్రచారం చేస్తున్నదని టీడీపీ ఆరోపిస్తోంది. టీడీపీ ఆరోపిస్తున్న ప్రకారం కుప్పం పట్టణంలోని ఓ మసీదులో శుక్రవారం ప్రార్థనల సమయంలో అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి వచ్చారు. కరపత్రాలతో కూడిన ఒక పార్శిల్‌ను వెంట తీసుకొచ్చారు. అనుమానించిన అక్కడే ఉన్న టీడీపీ నాయకులు, సానుభూతిపరులు అతడిని నిలదీశారు. పార్శిల్ విప్పి చూడగా అందులో 'ప్రమాదంలో ముస్లింలు' పేరుతో ఉన్న 16 పేజీల బుక్‌లెట్లు అధిక సంఖ్యలో కనిపించాయి. ఈ బుక్‌లెట్ కవర్ పేజీపై కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరిల ఫొటోలు ముద్రించి ఉన్నారు. బుక్‌లెట్‌లోని మొత్తం 16 పేజీలలోనూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే ముస్లింలకు ఇబ్బందులు తప్పవన్న అర్థంలో పలు ఆర్టికల్స్ ప్రచురించారు. రేణుక పోతినేని అనే సీనియర్ జర్నలిస్టు దీన్ని రాసినట్లు కూడా ఒక పేజీలో ఉంది. దీనిపై టీడీపీ నాయకులు కుప్పం అర్బన్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సైతం ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆపైన ఆధారాలు లేవంటూ వదిలేసినట్లు తెలిసింది. చాలా రోజులుగా ఈ బుక్‌లెట్‌తో కుప్పం నియోకవర్గంలో వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నట్లు టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ప్రత్యేకించి ముస్లిం కమ్యూనిటీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఎన్డీయే కూటమిపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది మతకలహాలకు దారి తీసే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. దీనిపై కుప్పం అర్బన్ సీఐ రమణను వివరణ కోరగా మసీదు వద్ద గొడవ జరుగుతున్నట్లు సమాచారం వస్తే తమ పోలీసులు వెళ్లారన్నారు. అయితే తమకు ఎటువంటి ఫిర్యాదు ఎవరినుంచీ అందకపోవడంతో వెనక్కు వచ్చేశారని చెప్పారు.

టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్



పలమనేరు, మే10 : పలమనేరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో మండలంలోని కరిడిమడుగు మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, వి.కోట మండలం క్రిష్ణాపురం పంచాయతీ ఎంపీటీసీ-2 నాగరాజు, పలమనేరు మండలం తవడపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శ్రీహరి తెలుగుదేశం పార్టీలో చేరారు. సుబ్రమణ్యంరెడ్డితో పాటు ఆయన అనుచరులు శేఖర్, సతీష్, హరిక్రిష్ణ కూడా టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో వి.కోట టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, మైనారిటీ అధ్యక్షుడు నాసిర్, మాజీ సర్పంచ్ సుబ్బన్న, పంచాయితీ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకరప్ప, గణేష్, మంజునాథ్, ప్రతాప్‌రెడ్డి, సనావుల్లా పలమనేరు మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. నేలరాలిన మామిడి



రొంపిచెర్ల, ఏప్రిల్10: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు మామిడి పంట నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మోటుమల్లెల, చెంచమరెడ్డిగారిపల్లె, పెద్దగొట్టిగల్లు పంచా యతీల్లో ఈదురు గాలులతో పంట నేల రాలిపోయిందన్నారు. ఇంత కాలం ఎండ తీవ్రతతో పిందె దశలో కొంత పంట నష్టం జరిగింది. మిగిలిన పంట గాలివానకు రాలిపోయిందని విచారం వ్యక్తం చేశారు.

జోరుగా టీడీపీ నాయకుల ప్రచారం



టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు షౌకత్‌అలి ప్రచారం

బైరెడ్డిపల్లె, మే 10 : మండలంలోని వివిధ పంచాయతీల్లో టీడీపీ నాయకుల జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆయా పంచాయతీల్లో స్థానిక టీడీపీ నాయకులు శుక్ర వారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును, ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతో ఉందని జరగనున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేటితో ప్రచారం బంద్

చౌడేపల్లె, మే10: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 6గంటలకు అన్ని పార్టీలు ప్రచారాలు బంద్ చేయాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలియజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6 తర్వాత ప్రచారం నిర్వహిస్తే ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అన్నిపార్టీ ల నాయకులు సహకరించాలని కోరారు.

ఓటుకు నోటు కోసం..!

పుంగనూరు, మే 10: రెండురోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నా రాజకీయ పార్టీలు ఓటర్లకు నోటు పంపకాలు జరగకపోవడంతో జనం రాత్రింబవళ్లూ ఓటుకు నోటు కోసం ఎదురు చూస్తూ గడుపుతున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ వారు ఓటుకు రూ.3 వేలు చొప్పన, టీడీపీ వారు ఓటుకు రూ.1500 చొప్పన బుధవారం నుంచి పుంగనూరులో మొదలు పెట్టారు. నోటు పంపకాలు మొదలైన విషయం క్షణాల్లో మిగిలిన ప్రాంతాలకు వ్యాప్తి కావడంతో పుంగనూరులో జనం రాజకీయనాయకుల కోసం ఎదురుచూస్తూ గడిపారు. కొద్దికొద్దిగా పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో పంపిణీ సాగుతుండగా సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో జనం తమకెప్పుడంటూ స్థానిక నేతలపై ఒత్తిళ్లు పెంచారు. దీంతో పార్టీ అభ్యర్థులపై నాయకులు నోట్లు పంపకాలు చేపట్టాలని పట్టుపడుతున్నారు. పేదలైతే ఉచితంగా వచ్చే డబ్బు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇంకొందరైతే డబ్బుల కోసం స్థానిక నాయకులను నిలదీస్తున్నారు. కూలీలు, ఇతర పనులకు వెళ్లే వారు మూడు రోజులుగా ఇళ్లవద్దే ఓట్ల నోట్ల కోసం ఇళ్ల వద్దే ఉంటున్నారు.

సోమల: పోలింగ్‌కు ఇంక రెండు రోజులే గడువు ఉంది. అయితే నగదు పంపిణీ రూ.2 వేలా, రూ.3వేలా అంటూ పలవురు ఓటర్లు చర్చించుకుంటున్నారు. ఏ పార్టీ వారు ఎంత ఇస్తున్నారు అని తెలుసుకుంటున్నారు. మందు బాబులైతే నగదుతో పాటు మద్యం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే డబ్బు తీసుకున్నా నచ్చినవారికే ఓటేయాలని పలువురు చర్చించుకుంటున్నారు.

నేడు బీసీవై పార్టీ జయకేతనయాత్ర ర్యాలీ

పుంగనూరు, మే 10: పుంగనూరు నియోజకవర్గంలో బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్ శనివారం పెద్దఎత్తున జయకేతన యాత్రర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు సాంబమూర్తి, నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 11వ తేదీ ఉదయం 7గంటలకు పుంగనూరు చెరువు కట్టమీద నుంచి ర్యాలీ ప్రారంభమై 7-45గంటలకు గోకుల్‌సర్కిల్, 9గంటలకు చౌడేపల్లె, 10 గంటలకు సోమల, 11గంటలకు సదుం, 12గంటలకు కల్లూరు, మధ్యాహ్నం 1గంటకు పులిచెర్ల, 2గంటలకు రొంపిచెర్ల, సాయంత్రం పుంగనూరులో ర్యాలీ కొనసాగుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు, రామచంద్రయాదవ్ అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాఘవేంద్రస్వామికి ప్రత్యేకపూజలు

బైరెడ్డిపల్లె, మే 10 : మండలంలోని తీర్థం గ్రామంలో ఉన్న రాఘవేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రమేషా చార్యులు, గిరీషాచార్యులు స్వామివారికి విశేషాలంకరణ చేసి పూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అరుణ ,రఘు ఉభయ దారులుగా వ్యవహరించారు. గురురాజా సేవాసమితి నిర్వాహకులు మురళీధరరావు, శ్రీనివాసమూర్తి, మోహన్, గోపాల్, గురురాజ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరూ ఓటేయాలి



కల్లూరు, మే 10: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఏపీఎం మదుసూదన్ తెలిపారు. పులిచెర్లలో శుక్రవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు హక్కును సద్వినియోగం చేసుకో వాలన్నారు. స్త్రీశక్తి భవనం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సీసీలు వాహిద్ బాషా, పవన, సంఘమిత్రలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

చౌడేపల్లె, మే10: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణే లక్ష్యం అని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం చౌడేపల్లెలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వాసు, కేంద్రబలగాలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బాటగంగమ్మకు విశేషపూజలు

బైరెడ్డిపల్లె, మే 10 : బైరెడ్డిపల్లెలోవున్న బాట గంగమ్మ ఆలయంలో శుక్ర వారం ప్రత్యేకపూజలు నిర్వ హించారు. అర్చకులు నాగేంద్ర అమ్మవారికి అభి షేకంచేసి విశేష పూజలు జరిపారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, మే10: పుది పట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభి షేకాలు నిర్వహించారు. తర్వాత ప్రత్యేకంగా అలం కరించి భక్తులకు దర్శనం కల్పించారు.

భూముల దోపిడీకే ల్యాండ్ టైటిలింగ్ చట్టం



తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ల్యాండ్ టైటిల్ చట్టం ప్రతులను దగ్ధం చేస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మే10 : ప్రజల భూములను దోచుకునేందుకే వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటి లింగ్ చట్టాన్ని తీసుకొచ్చిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ పిలుపు మేరకు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ల్యాండ్ టైటిల్ యాక్టు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు బీజేపీ సహా ఏ రాష్ట్రంలోనూ ఈ చట్టం అమలు చేయలేదన్నారు. అయితే ప్రజల భూములను కబ్జా చేసేందుకే జగన్ ఈ చట్టం తెచ్చారన్నారు. భూములకు రక్షణగా ఉన్న కోర్టులను ఈ చట్టం ద్వారా పక్కకు తప్పించి ప్రజల భూములు కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. జగన్ బినామీ కంపెనీ ఇండోసోల్‌కు వేలాది ఎకరాల రైతు భూ ములను కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా జగన్ భూమాఫియా లక్షలాది ఎకరాలు కబ్జా చేయడానికి ఈ చట్టం చేశారని పేర్కొన్నారు. జగన్‌కు ఓటేయడమంటే మన భూమిని మనం వదులుకున్నట్లే అని హెచ్చరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. అనంతరం ల్యాండ్ టైటిల్ యాక్టు చట్టం ప్రతులను దగ్ధం చేశారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి

తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావును సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందన్నారు. విద్యుత్, ఆర్టీసీ, పెట్రోలు చార్జీలు భారీగా పెంచి ప్రజలపై మోయలేని భారం మోపింద న్నారు. ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదన్నారు. కనీసం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో పయనించాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడిగోపాల్, ఆర్బీసీ కుట్టి, సుబ్రమణ్యంగౌడు, అమరనాథరెడ్డి, రవి, సుదర్శన్, బాలాజి, జనసేన నాయకులు దిలీప్, నాగరాజ, బీసీ నాయకులు పూసల రవి పాల్గొన్నారు.

పుంగనూరులో రౌడీరాజ్యం అంతం కావాలి





పుంగనూరులో ప్రచారం చేస్తున్న చల్లా వీణారెడ్డి, చెంచమరెడ్డిగారిపల్లెలో చల్లా సుప్రియారెడ్డి ఇంటింటి ప్రచారం

పుంగనూరు, మే10: 'పుంగనూరులో టీడీపీ గెలవాలి..రౌడీరాజ్యం అంతం కావాలి' అని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి చల్లా వీణారెడ్డి కోరారు. శుక్రవారం పుంగనూరులో ఆమె టీడీపీ మహిళా నాయకులు విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ రత్నమ్మ, కవిత, విజయకుమారి తదితరులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, కమలం గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ● మండలంలోని మంగళం పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు మాధవ రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు విరూపాక్షి గ్రామాల్లో పర్యటించి ఎన్డీయే మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు యువతకు ఉద్యోగ అవకాశాలు కావాలంటే తెలుగుదేశం పార్టీకి అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శమిపతి, సుబ్రహ్మణ్యం, గంగాధర్, ప్రసాద్, జనసేన నాయకులు హరినాయక్, బాలాజీ నాయక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కుమార్తె చల్లా పూజారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు పంపిణీ, మహిళలకు నెలకు రూ.1500, చదువుకునే ప్రతి బిడ్డకూ ఏడాదికి రూ.15వేలు, 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్ ఇస్తామని తెలియజేశారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు పూల రమేష్, మోహన్‌దాస్, త్యాగరాజు, మునీంద్ర, చంద్రశేఖర్, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని చల్లాబాబు సతీమణి చల్లా సుప్రియారెడ్డి కోరారు. మండలంలోని చెంచమరెడ్డిగారిపల్లె పంచాయ తీలోని గ్రామాల్లో ఆమె ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్ర గిరి మనోజ్‌కుమార్, నాయకులు రఘు, చెంగల్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఏఎస్పీ



పుంగనూరులో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న ఏఎస్పీ ఆరీఫుల్లా

పుంగనూరు రూరల్, మే10: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు నియోజక వర్గ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చిత్తూరు అడిషనల్ ఎస్పీ ఆరీఫుల్లా పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరులో ముగ్గురు ట్రైనీ ఐపీఎస్ అధికారులు, కేంద్ర సీఆర్పీఎఫ్ బలగాలు, తమిళనాడు పోలీసులు, సర్కిల్ పరిధిలోని పోలీసులతో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసుబందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్, నిఘా పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఎక్కడైనా పోలింగ్‌కు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్య అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే10: పుంగనూరు విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్య అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పలుచోట్ల కేంద్ర బలగాల కవాతు



సోమలలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

సోమల, మే 10: సోమల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని కోరారు. సోమల, కందూరు, పెద్దఉప్పరపల్లె, నంజంపేటల్లో కవాతు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట నరసింహులు, పోలీసులు పాల్గొన్నారు.

వి.కోట: వి.కోటలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సంఘం పలమనేరు నియోజకవర్గాన్ని అత్యంత సమస్యాత్మక సెగ్మెంట్‌గా గుర్తించారు. ఈ కవాతులో సీఐ లింగప్ప, ఎస్ఐ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిపురం: శాంతిపురంలో కేంద్ర ఆర్మీ బలగాలు కవాతు నిర్వహించాయి. కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బడుగుమాకులపల్లె టీటీడీ కళ్యాణ మండపం నుంచి శాంతిపురం సచివాలయం వరకు కవాతు చేశారు. ఎస్ఐ సుమన్, శిక్షణ ఐపీఎస్‌లు ఆదిత్య శ్రీవాత్సవ్, అభినవ్ జైన్, అజయ్ సింగ్ రాథోడ్ ప్రొబేషనరి డీఎస్పీ ఆర్‌అభిషేక్ ఉన్నారు.

మైనారిటీల సంక్షేమం టీడీపీతోనే

వి.కోట, మే 10: రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం, మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కేవలం టీడీపీతోనే సాధ్యమని ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్ని మసీదుల వద్ద ముస్లిం, మైనారిటీలతో కలసి టీడీపీ మేనిఫ్యాస్టోతో కూడిన కరపత్రాలను అందించి సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, కార్యదర్శి ఈశ్వర్, నాయకులు రుహుల్లా, షేక్ ఉమ్మర్, యాసీర్, ఆరీఫుల్లా, అమానుల్లా, సోమశేఖర్, దీరజ్, శబరీష్, నారాయణ స్వామి, భక్తా, హరి, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి



వి.కోట, మే 10: ఆర్థికంగా కుంగిన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌ను ఆదరించాలని పలమనేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శివశంకర్ అన్నారు. శుక్రవారం వి.కోటలో రోడ్‌షో, ర్యాలీ నిర్వహించారు. తనకు ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఏపీసీసీ అబ్యులు ఇనాయతుల్లా ఖాన్, ఇతర నాయకులు సుధాకర్, శంకర, నాగరాజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిపురంలో ముమ్మర ప్రచారం



వెదురుట్టపల్లెలో ప్రచారంలో కూటమి నేతలు

శాంతిపురం, మే 10: శాంతిపురం మండల పరిధిలో కూటమి తరపున నేతలు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. శుక్రవానం మండల పరిధిలోని వెదురు గుట్టపల్లె, బీఎం గొల్లపల్లె, అడ్డవంక, రాములవారివంక, తిమ్మాపురం గ్రామాలో బెంగళూరు వీఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత ఎంబీ రమేష్ నాయుడు, కాకర్ల పురుషోత్తం నాయుడు వారి సిబ్బంది కూటమి తరపున విసృత ప్రచారం నిర్వహించారు. కుప్పం ప్రజలు చంద్రబాబును అఖండ మెజారిటీతో గెలిపించి ఈ రాష్ట్రానికి మరో సారి ముఖ్యమంత్రి చేయాలని ఓటర్లుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివశంకర్, చంద్ర, బుజ్జి, రాయల్, చల్లా మంజునాథ్, సల్లా సుధాకర్ ఉన్నారు.

పీవీరావుకు ఘననివాళి



పుంగనూరు రూరల్, మే10: మాలమహానాడు వ్యవస్థాపకుడు డాక్టర్ పీవీరావు జయంతిని పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక పుంగమ్మ చెరువు కట్టపై మాలమహానాడు కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి మాలలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన పీవీ రావు సేవలు అజరామరమని కీర్తించారు. నాయకులు శ్రీనివాసులు, భాస్కర్, నాగరాజ, రెడ్డి, మంజు, శ్రీను, మల్లి పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి 37 బస్సుల కేటాయింపు

కుప్పం, మే 10: ఈనెల 13న జరుగబోయే సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి కుప్పం నుంచి వివిధ నియోజకవర్గాలకు వెళ్తున్న సిబ్బంది కోసం కుప్పం ఆర్టీసీ డిపో నుంచి 37 బస్సులు కేటాయిస్తున్నట్లు డిపో మేనేజరు పెంచలయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బస్సులు ఆదివారం తెల్లవారుజామున డిపోనుంచి ఆయా నియోజకవర్గ కేంద్రాలకు బయలుదేరుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గాల పేర్లతో కూడిన స్టిక్కర్లు బస్సులకు అంటిస్తామని తెలియజేశారు. ఎన్నికల డ్యూటీ ఆర్డర్ కాపీ చూపించి, ఎన్నికల సిబ్బంది ఈ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి తమకు విధులు కేటాయించిన ప్రాంతాలకు చేరుకోవచ్చని ఆయన సూచించారు. వివరాలు కింద ఉన్నాయి.

● బస్సులు కేటాయించిన తేదీ: 12.5.2024, సమయం: ఉదయం.

నియోజకవర్గ కేంద్రం	బస్సుల సంఖ్య	బయలుదేరు సమయం	చేరే సమయం
1. పలమనేరు	5	05.00	06.30
2. నగరి	2	02.00	07.00
3. గంగాధర నెల్లూరు	7	04.00	07.00
4. పూతలపట్టు	9	04.30	07.00
5. పుంగనూరు	14	04.00	07.00

వెబ్‌కాస్టింగ్ నిఘాలో పుంగనూరు

● ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
● పీవోలు, ఏపీవోలు, సిబ్బంది 1660మంది
● 100 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు
● ఎన్నికల అధికారి మధుసూదన్‌రెడ్డి



పుంగనూరు, మే 10: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పుంగనూరు నియోజకవర్గంలో వెబ్‌కాస్టింగ్ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిట్నరింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పుంగనూరు అర్బన్, రూరల్, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 265 పోలింగ్ కేంద్రాల్లో 2,38,868 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో పురుషులు 1,17,072 మంది, మహిళలు 1,21,791 మంది, ట్రాన్స్ జెండర్లు ఐదుగురు ఉన్నారన్నారు. 262 పోలింగ్ కేంద్రాలు ఉం డగా 1400 మంది ఓటర్లు కంటే ఎక్కువగా ఉన్న మోదు గులపల్లె, నక్కబండ, రొంపిచెర్లలో అద నంగా మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుతో 265కు పెరిగాయని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, ఓపీవోలతో కలిపి ఆరుగురిని నియమించామని, 28 రూట్లు, 8 సెక్టార్ రూట్లు ఏర్పాటు చేసి ఎన్నికల విధులకు 1660 మందిని నియమించామని తెలిపారు. అన్నిపోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలతో బాటు అదనంగా 20 శాతం ఈవీఎంలు, 20శాతం ఉద్యోగులను రిజర్వులో ఉంచామని వివరించారు. పుంగనూరులో 100 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకంగా గుర్తించి తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 13వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసు బందోబస్తు, వెబ్‌కాస్టింగ్ నిఘా ఉంటుందన్నారు. 150 మంది వీడియోగ్రాఫర్లు అన్నింటినీ చిత్రీకరిస్తారని వివరించారు. పోలింగ్ కేంద్రాలల్లో విద్యుత్, తాగునీరు, మౌలిక వసతులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసి ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు పంపుతామన్నారు. పోలింగ్ ముగియగానే చిత్తూరు ఎస్వీ సెట్ కాలేజీ కౌంటింగ్ సెంటర్‌కు తీసుకెళ్లాల్సి ఉందన్నారు. ప్రశాంత పోలింగ్‌కు ప్రజలు, అన్ని పార్టీలు సహకరించాలని ఆయన కోరారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు కట్టుదిట్టమైన భద్రత


ఎస్వీసెట్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 10: ఓట్ల లెక్కింపు కోసం ఎంపిక చేసిన ఎస్వీసెట్ (శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల)లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఎస్వీసెట్‌లో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లను, రిసెప్షన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రవేశించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరే ప్రక్రియ గురించి అధికారులకు పలు సూచనలిచ్చారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, పూతలపట్టు ఆర్వో, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య కలెక్టర్ వెంట ఉన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే10: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నిర్భయంగా ఓటేయండి



చిత్తూరు, మే 10: ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటేయాలని, పోలీసులు అండగా ఉంటారని ఏఎస్పీ అరీఫుల్లా కోరారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనుండడంతో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా శుక్రవారం కేంద్ర బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజల్లో భయాందోళనలు పోగొట్టేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని ఏఎస్పీ తెలిపారు.

తగ్గిన ఎండవేడి

చిత్తూరు కలెక్టరేట్, మే 10: జిల్లాలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న చెదురుమదురు వర్షాలతో ఎండవేడిమి తగ్గింది. శుక్రవారం శ్రీరంగరాజపురంలో 40.5, పెద్దపంజాణి 40.2, పాలసముద్రం 40, తవణంపల్లె 39.5, చిత్తూరు 39.4, గుడిపాలలో 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన మండలాల్లో అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పతనం దిశగా టమోటా ధర


మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

సోమల, మే 10: టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. గురువారం సోమల మార్కెట్లో 15కిలోల బాక్సు రూ.270 పలకగా, శుక్రవారం నాటికి 170కి పడిపోయింది. కిలో రూ.11 పలికింది. మార్కెట్‌కు సరుకు పెరగడం వల్లే ధర తగ్గుతోందని వ్యాపారులు తెలిపారు. ఫిబ్రవరిలో నాటిన పొలాల నుంచి దిగుబడులు బాగా వస్తున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో నాటిన మొక్కలు ఎండల తీవ్రతతో సరిగా రాలేదని, తద్వారా దిగుబడి తగ్గే అవకాశముందని రైతులు అంటున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.97 కోట్లు

తిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.97 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 65,508 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,996 మంది తలనీలాలు సమర్పించారు.

సింహాచలం అప్పన్నకు టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

విశాఖపట్నం సమీపంలోని సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి(అప్పన్న)కి టీటీడీ తరపున శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. 1996 నుంచి అప్పన్నకు పట్టువస్త్రాలను టీటీడీ సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అప్పన్న విగ్రహం ఏడాది పొడవునా చందనంతో కప్పి ఉంటుంది. ఏడాదిలో 12 గంటలు మాత్రమే చందనం పూత లేకుండా స్వామి దర్శనమిస్తారు. అక్షయతృతీయ రోజున స్వామి విగ్రహానికి చందనం పూత తొలగించి, తిరిగి పూస్తారు. చందన యాత్ర, చందనోత్సవం పేరుతో ఏటా వైశాఖమాసంలో జరిగే ఈఉత్సవాన్ని పురస్కరించుకునే పట్టువస్త్రాలు సమర్పించింది.

తిరుమలలో వ్యక్తి మృతి



తిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలోని కల్యాణవేదిక వద్ద సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి ఎలాంటి కదలికలు లేకుండా ఉన్నాడని పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది ఘటనాప్రాంతానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్టు తేలింది. అక్కడ ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 0877 2289031 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్ ఏర్పాటు

తిరుపతి(సెంట్రల్), మే10: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు-తిరుపతి మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(17261-17262)కు అదనంగా ఒక సాధారణ కోచ్‌ను శుక్రవారం నుంచి ఏర్పాటు చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ సౌకర్యం 13వ తేదీవరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మే 10: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 10: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గత హామీల ఊసేది జగన్?

మండే ఎండలో చప్పగా ముగిసిన సీఎం ప్రచార సభ

పుత్తూరు అర్బన్, మే 10: పుత్తూరులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన సీఎం జగన్ సభలో ఆయన ప్రసంగంలోనూ, మంత్రి రోజా ప్రసంగంలోనూ నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేస్తామనే విషయాన్ని స్పష్టం చేయకపోవడంపై వైసీపీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. రోజా తాను ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసేశానని చెప్పుకోవడం తప్ప ప్రత్యేకించి ఫలానా అభివృద్ధి చేశాననే అంశాన్ని ప్రస్తావించకపోవడం పట్ల కూడా ఆ పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో పాటు జగన్ తన ప్రసంగంలో గత ఎన్నికల సందర్భంగా ఇదే కూడలిలో నిర్వహించిన సభలో ఇచ్చిన హామీలను కూడా ప్రస్తావించలేదు. గాలేరు-నగరి ప్రాజెక్టులో అంతర్భాగమైన వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు గాజుల మండ్యం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తానని గత ఎన్నికల సందర్భంగా పుత్తూరులో జరిగిన సభలో జగన్ వాగ్దానం చేశారు. తిరిగి అధికారంలోకి వస్తే వాటిని నెరవేరుస్తామని కూడా ఆయన చెప్పకపోవడం వైసీపీ వర్గాలనే అసంతృప్తికి గురి చేసింది. సీఎం షెడ్యూల్ ప్రకారం 45 నిమిషాల పాటు ప్రసంగించాల్సి ఉంది. జగన్ ప్రసంగం ప్రారంభంకాగానే ఎండవేడిమికి తాళలేక పలువురు వెనుదిరగడం కనిపించింది. దీంతో ప్రసంగ సమయాన్ని 30నిమిషాల్లోనే పూర్తి చేశారు.

పింఛన్ కట్ బెదిరింపు....

ఇదిలా ఉండగా సీఎం జగన్ సభ విజయవంతానికి వైసీపీ నాయకులు తీవ్ర కసరత్తే చేశారు. వడమాలపేట మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి పింఛన్ కట్ చేస్తామని బెదిరించి మరీ సభకు బలవంతంగా తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు వలంటీర్లను వినియోగించినట్లు సమాచారం. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు ఉండడంతో సభా ప్రాంగణానికి వచ్చేందుకు కిలోమీటర్ పైన నడవాల్సి వచ్చింది.

ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు

జగన్ రావడానికి రెండున్నర గంటల ముందు నుంచే పుత్తూరులో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. పుత్తూరు పట్టణం కాపువీధి జంక్షన్‌లో సభ పెట్టడంతో చిత్తూరుకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు చిత్తూరు నుంచి వచ్చేవారు కూడా వినాయకపురం మీదుగా కనకంపాలెం, మిద్దిగుంట రోడ్డు మార్గంలో పుత్తురుకు రావాల్సి వచ్చింది. 10 నిమిషాల



ప్రయాణం గంటన్నర పట్టింది. తిరుపతి-పుత్తూరు మార్గంలో కూడా పోలీసులు ఆంక్షలు పెట్టడంతో వాహనదారులు అగచాట్లు పడ్డారు. బైపాస్‌రోడ్డులోనే బస్సులు, కార్లు నిలిపివేయడంతో పున్నమి సర్కిల్ నుంచి కాలినడకనే పుత్తూరులోకి రావాల్సి వచ్చింది. నగరి నుంచి వచ్చేవారిని కూడా నారాయణవనం బైపాస్ సర్కిల్‌లో నిలిపివేయడంతో ఆటోలపై ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జగన్ పర్యటన నేపథ్యంలో సభ సమీప ప్రాంతాల్లో దాదాపు గంట సమయం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తీవ్రమైన ఎండ వేడితో సమీపంలోని ఇళ్లలో నివసించే ప్రజలు అల్లాడిపోయారు.సీఎం సభలో కొందరు మద్యం మత్తులో ఊగిపోతూ వైసీపీ జెండాలు పట్టుకుని హల్‌చల్ చేశారు.


జగన్ అభివాదం

నిరూపిస్తే వదిలి వెళ్లిపోతాం: రోజా


తన అన్నలు ఎక్కడ దోచుకున్నారో చెబితే ఇక్కడ (నగరి నియోజకవర్గం) నుంచి వదిలి వెళతామని సభలో మంత్రి రోజా సవాల్ విసిరారు.చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, గాలి భానుప్రకాష్.. తనను రాజకీయంగా ఎదుర్కొనలేకే ఇలా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.14 కోట్లు

ఐరాల(కాణిపాకం), మే 10: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,14,63,904 లభించినట్లు ఈవో వెంకటేశు వెల్లడించారు. ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం స్వామి కానుకలను ఈవో పర్యవేక్షణలో లెక్కించారు. 591 యూఎస్ఏ, 40 ఆస్ట్రేలియా డాలర్లు, 25 యూఏఈ దిర్హామ్స్, 25 యూరోలు, 5 సౌదీ రియాల్స్ లభించినట్లు ఆయన వివరించారు. 21 రోజులలో ఈ ఆదాయం లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మల్లికార్జున పాల్గొన్నారు.


స్వామి కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఘనంగా రామానుజ అవతార ఉత్సవాలు ప్రారంభం


ప్రసంగిస్తున్న రంగరాజన్

తిరుపతి(కల్చరల్) మే 10: శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడితో సమానంగా భాగవతులకు కూడా గౌరవం ఉంటుందని, అదే విధంగా రామానుజులు పూజింపబడుతున్నారని డాక్టర్ చక్రవర్తి రంగరాజన్ అన్నారు. శుక్రవారం టీటీడీ, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాలు మొదలయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలి రోజు సాయంత్రం 5.30 గంటలకు చిన్న జీయరుస్వామి అనుగ్రహభాషణంతో సాహితీ సదస్సు ప్రారంభించారు. అనంతరం రంగరాజన్ మాట్లాడుతూ.. నేటికీ సమతామూర్తిగా కొనియాడబడుతున్న రామానుజులకు తిరుపతితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. అనంతరం రేవతి బృందం భక్తి సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజక్టు అధికారి కోకిల, డీపీపీ అధికారి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేటి సమావేశం:

ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు అహోబిలానికి చెందిన కె. సేతురామన్ ప్రసంగం ఉంటుంది. తరువాత కె. చంద్రశేఖర్ హరికథా గానం ఉంటుంది.

వైసీపీ నేత షెడ్డులో మద్యం పట్టివేత

అధికారులపై దాడికి తెగబడ్డ అధికార పార్టీ నేతలు - రూ.10.3 లక్షల నగదు సీజ్


పట్టుబడిన మద్యంతో అధికారులు

వి.కోట, మే 10: మండలంలోని కొంగాటం పంచాయతీ క్షీరసాగరానికి చెందిన వైసీపీ నేత జయరామిరెడ్డి మల్బరీ షెడ్డులో 12 కేసుల మద్యం పట్టుబడింది. రహస్య సమాచారం మేరకు స్పెషల్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న శుక్రవారం రాత్రి జయరామిరెడ్డి మల్బరీ షెడ్డులో సోదాలు చేశారు. ప్లాస్టిక్ సంచిలో మద్యాన్ని గుర్తించారు. అనంతరం ఆయన ఇంట్లో సోదాలు చేసేందుకు ప్రయత్నించగా అనుచరులు, మండల ముఖ్యనేత వారిని బెదిరించారు. రక్షణ కోసం వారు పోలీసులను ఆశ్రయించారు. పట్టుబడిన 12 కేసుల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. అయితే అధికార నేతలపై కేసులు లేకుండా చూసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

నగదు పట్టివేత

కర్ణాటక నుంచి పత్రపల్లె మీదుగా వస్తున్న కారులో రూ. 10.3 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఏసీబీ సూపరింటెండెంట్ రవి తెలిపారు. బెంగళూరుకు చెందిన రాజారెడ్డి రాజుపేటలోని తన కుమార్తె వద్దకు కారులో వస్తుండగా పత్రపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీలో నగదు పట్టుబడింది. సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి అండగా నిలవాలి : దగ్గుమళ్ల


రామకుప్పం రోడ్‌షోలో అభివాదం చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు - కుప్పంలో ప్రచారం చేస్తున్న దగ్గుమళ్ల

రామకుప్పం, మే 10: రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలంతా టీడీపీని ఆదరించాలని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. శుక్రవారం ఆయన రామకుప్పంలో రోడ్‌షో నిర్వహించారు. అంతకుముందు గడ్డూరు గ్రామంలో దళితులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి జరగకపోగా అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని విమర్శించారు. వైసీపీ ఒఅధికారంలోకి వచ్చాక ఎస్సీలకు సంబంధించి 27పథకాలను ఆపేశారని వివరించారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా చంద్రబాబును, ఎంపీగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

ఓటర్లు ఇప్పటికే నిర్ణయం తీసేసుకున్నారు

కుప్పం : ఓటర్లు తమ ఓటు ఎవరికి వేయాలో ఇప్పటికే నిర్ణయం తీసేసుకున్నారని, కచ్చితంగా సైకిల్ గుర్తుపైనే పడుతుందని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. కుప్పం మున్సిపాలిటీలోని 23, 24 వార్డుల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ప్రజల్లోకి బలంగా వెళ్లిందని, వైసీపీ మేనిఫెస్టో తుస్సుమందని ఎద్దేవా చేశారు. కుప్పంలో చంద్రబాబు, చిత్తూరు పార్లమెంటు స్థానంలో తాను అత్యధిక మెజారిటీతో గెలువబోతున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలపై చేసిన దాడులు, సాగించిన అరాచకాలు ఇందుకు దోహదం చేశాయని చెప్పారు.


రామకుప్పంలో ప్రచారం

అమ్మవారి ఆలయానికి రెండు వెండి పళ్లెం వితరణ


ఆలయ అధికారులకు దాత అందజేసిన హారతిపళ్లెం

తిరుచానూరు, మే 10: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిఆలయానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన కీర్తిమాన్ పాండే రూ.లక్ష విలువ చేసే రెండు వెండి హారతిపళ్లేలాలను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకుడు బాబుస్వామి పాల్గొన్నారు.

ఐఐటీ, నీట్ పరీక్షల ఫిజిక్స్ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: ఐఐటీ, నీట్ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఫిజిక్స్ అవగాహన కోసం రూపొందించిన పుస్తకాన్ని ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ఆవిష్కరించారు. ఎస్వీయూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ దేవప్రసాదరాజు మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ అడ్వాన్స్, మెయిన్స్ పరీక్షల కోసం చదువుకుంటున్న విద్యార్థులకు ఫిజిక్స్ సంబంధించిన గొప్ప అవగాహనను ఈ పుస్తకం అందిస్తుందన్నారు. ఈ పుస్తకాన్ని రాసిన రచయిత అశోక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్ శేఖర్, ప్రొఫెసర్ కుసుమ హరనాథ్, ప్రొఫెసర్ కుమారస్వామి, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తిరుచ్చిపై పద్మావతి దేవి అభయం


మాడవీధుల్లో ఊరేగుతున్న పద్మావతిదేవి

తిరుచానూరు, మే 10: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీ పూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు వేంచేపు చేసి వేడుకగా అర్చకులు తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతిదేవికి తిరువీధి ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, చంద్రశేఖర్, శేషగిరి, ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సుభాస్కర్ నాయుడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా

ఇద్దరు చిల్లకూరు యువకుల దుర్మరణం


వేణు, ఆకాష్ (ఫైల్‌ఫొటోలు)

పెళ్లకూరు, మే 10: నెల్లూరు జిల్లా మనుబోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి వేణు(19), చల్లా ఆకాష్(20) దుర్మరణం చెందారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరుకి చెందిన బండి చంద్రయ్యకు ఇద్దరు పిల్లలు. ఆయన కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమారుడు వేణు ఇటీవల ఇంటర్ పూర్తిచేశాడు. నాలుగురోజుల క్రితం కుమారుడికి సెకండ్ హ్యాండ్ బైక్ తీసిచ్చాడు. బైక్‌కు కట్టాల్సిన డబ్బులు, పేరు మార్పు కోసం వేణు చిల్లకూరుకి చెందిన తన స్నేహితుడు చల్లా ఆకాష్‌ను తీసుకుని నెల్లూరుకి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నెల్లూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మనుబోలు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి ఎడమపక్కకు రాగా, సర్వీసు రోడ్డు స్టాఫ్ బోర్డును ఢీకొని బైక్ బోల్తా పడింది. ప్రమాద స్థలంలోనే తలఛిద్రమై వేణు మృతి చెందాడు. ఆకాష్ తీవ్రగాయాలతో రోదిస్తుండగా 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకి తరలించారు. చికిత్స పొందుతూ ఆకాష్ కూడా మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మనుబోలు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. రెండు కుటుంబాల్లో ఒక్కగానొక్క కుమారులు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు విలపించారు.

స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్ : ఒకరికి గాయాలు

ఏర్పేడు, మే 10: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టరు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన ఘటన ఏర్పేడు మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... రాజులకండ్రిగ గ్రామానికి చెందిన రఘు ద్విచక్రవాహనంపై పాపానాయుడుపేటకు బయలుదేరాడు. ఫైల్‌సెంటర్ నుంచి రాజులకండ్రిగకు వస్తున్న ట్రాక్టర్‌ను స్కూటర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో గాయపడిన రఘును స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


రెండు కుటుంబాల ఘర్షణ : ముగ్గురిపై కేసు

ఏర్పేడు, మే 10:ఏర్పేడు మండలం పాగాలి పంచాయతీ కృష్ణంపల్లి గ్రామానికి చెందిన చెంగల్రాయులురెడ్డి, రోగిరెడ్డి కుటుంబాల మధ్య కొంతకాలంగా భూవివాదం ఉంది. శుక్రవారం సాయంత్రం పొలం వద్ద ఘర్షణ జరిగింది. చెంగల్రాయులురెడ్డిపై రోగిరెడ్డి కుటుంబసభ్యులు దాడి చేశారు. చెంగల్రాయులురెడ్డి ఫిర్యాదు మేరకు రోగిరెడ్డి, ఆయన కుమారుడు రమేష్‌రెడ్డి, మనవడు జయపై కేసునమోదు చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లరుగా రూ.వేల కోట్లు సంపాదించారు. జైలుకూ వెళ్లారు. అయితేనేం.. ఆ సొమ్మునే వైసీపీ రాజకీయాల్లో పెట్టుబడిగా పెట్టారు. అధికారంలోకి వచ్చాక చిత్తూరులో ఎమ్మెల్యేని కాదని, ఈయనే పవర్ సెంటరుగా మారారు. అధికారం అండగా.. తన సంపాదనను మరింత పెంచుకున్నారు. 12 ఎర్రచందనం కేసులున్న ఆయన్ను శాసనాలు చేసే చట్టసభకు పంపాలని వైసీపీ నిర్ణయం తీసుకుంది. ఎర్ర స్మగ్లరు అయినా.. ఎన్ని విమర్శలు వచ్చినా.. ప్రజలు ఏమనుకుంటారోనన్న భావనా లేకుండా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. విజయానందరెడ్డి నేపథ్యం.. ఈ ఐదేళ్లలో ఆయన అనుచరుల ఆగడాలు చూసిన చిత్తూరు ప్రజలు ఇతనా మా ఎమ్మెల్యే అభ్యర్థి అని విస్తుపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు

ఎర్రచందనం స్మగ్లర్‌కి ఓటెందుకెయ్యాలి?



చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డిపై ప్రజల్లో చర్చ

పీలేరు, రాజమండ్రి సెంట్రల్ జైలులో గడిపిన నేర చరిత్ర

'ఎర్ర'ధనమే పెట్టుబడిగా రాజకీయాల్లోకి వచ్చిన వైనం

అన్నిరకాల అక్రమ వ్యాపారాల్లో అనుచరుల హల్‌చల్

ఇదీ విజయానంద ప్రస్థానం

లారీ డ్రైవర్‌గా మొదలై..

నేనూ ఒకప్పుడు మీలాగే డ్రైవర్‌ని. డ్రైవర్ల కష్టాలు నాకు తెలుసు.

- ఇటీవల ఆటో డ్రైవర్ల సమావేశంలో వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి తన ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన చెప్పిన ప్రకారం.. సామాన్య కుటుంబం నుంచి లారీ డ్రైవరుగా జీవితాన్ని ప్రారంభించారని అనుకోవాలి. ఇలా లారీ డ్రైవర్లుగా ఉన్న వాళ్లు తమ కష్టంతో తర్వాత యజమానులు అయి ఉండొచ్చు. కానీ, రూ.వేల కోట్ల ఆస్తిపరులు కాలేదు.. కాలేరు. విజయానందరెడ్డి మాత్రం కాగలిగారు. ఇందుకు ఆయన ఎంచుకున్న మార్గం ఎర్రచందనం అక్రమ రవాణా.

కాంగ్రెస్ హయాంలో 'ఎర్ర' స్మగ్లింగ్

విజయానందరెడ్డిపై వివిధ పోలీసు స్టేషన్లలో 2014వ సంవత్సరంలో 12 ఎర్రచందనం కేసులు నమోదయ్యాయి. దీంతో ఎర్ర చందనం స్మగ్లరుగా ఆయన పేరు బయటకొచ్చింది. అంతకుముందు ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లపాటు కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ సమయంలోనే అధికారం అండగా ఆయన ఎర్రచందనం అక్రమ రవాణా జోరుగా సాగించినట్లు విమర్శలున్నాయి. అప్పటికే 'ఎర్ర' ధనాన్ని విపరీతంగా పోగేసుకున్నారు. ఆ తర్వాత వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రిజర్వుడు నియోజకవర్గాలకు, మరికొందరు అభ్యర్థులకు ఆర్థిక సాయం చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో విజయానందరెడ్డి గురించి రాజకీయంగా చర్చ జరిగింది.

టీడీపీ హయాంలో సెంట్రల్ జైలుకు..

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపింది. అలా చిత్తూరుకు సంబంధించి విజయానందరెడ్డిపై ఆ ఏడాదిలోనే వివిధ పోలీసు స్టేషన్లలో 12 కేసులు నమోదయ్యాయి. చిత్తూరు వన్‌టౌన్‌లో 3, కేవీపల్లె, బంగారుపాళ్యంలో రెండేసి, పీలేరు, గుడిపాల, పెనుమూరు, ఎస్‌ఆర్‌పురంలలో ఒక్కోటి చొప్పున కేసులున్నాయి. అలాగే 2014 ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణాకు సంబంధించి ఇంకో కేసు కూడా ఉంది. ఆ తర్వాత పీలేరు సబ్ జైలులో, కడప సెంట్రల్ జైలులో కొన్నాళ్లు, రాజమండ్రి సెంట్రల్ జైలులో సుమారు ఆరు నెలలు గడిపారు.

వైసీపీ వచ్చాక పవర్ సెంటర్‌గా..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక విజయానందరెడ్డి చిత్తూరులో పవర్ సెంటర్‌గా మారారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉన్నా.. అధికారులంతా ఆయన మాటే వినేలా సెటప్ చేసుకున్నారు. ఎమ్మెల్యేకు పవర్ లేకుండా చేసి ఆయనకు వ్యతిరేకవర్గంగా మారారు. మూడేళ్ల కిందట చిత్తూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో పూర్వ ప్రజాప్రతినిధి, ఓ కార్పొరేషన్ ఛైర్మన్‌తో కలిసి దౌర్జన్యంగా కార్పొరేటర్లను ఏకగ్రీవాలు చేసుకోవడంలో చొరవ చూపారు. వీరికి అప్పటి పోలీసు అధికారులు సహకరించి నామినేషన్లు వేసిన ప్రత్యర్థులను బెదిరించారు. 50 డివిజన్లలో 36 చోట బెదిరింపులు, దొంగ సంతకాలు, నామినేషన్ పత్రాలు చించేయడం.. వంటి దుశ్చర్యలతో ఏకగ్రీవం చేసుకున్నారు.

ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా..

2024 ఎన్నికల్లో పోటీ చేయాలన్న ప్రణాళికతో గత ఐదేళ్లుగా ఆయన చిత్తూరులో రాజకీయాలు నడిపారు. స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నప్పటికీ పార్టీ పరంగా ఈయనకే సహకారం అందింది. దీనికి సామాజికవర్గం ఓ కారణమన్న విమర్శలున్నాయి. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పదవీ వచ్చింది. ఇక, 'ఎర్ర' ధనంతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. వ్యాపారుల్ని ఆకట్టుకునేందుకు మార్కెట్‌కు గేటు ఫీజును చెల్లించడం, నియోజకవర్గంలో ప్రజలకు సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. అనుకున్నట్లుగానే ఇప్పుడు చిత్తూరు అసెంబ్లీకి వైసీపీ అభ్యర్థిగా మారారు. ఎర్రచందనం స్మగ్లర్‌కి వైసీపీ టిక్కెట్ ఇచ్చిందన్న విమర్శలు విపక్షాల నుంచి వినిపిస్తున్నాయి.

అనుచరులతో లాటరీ నిర్వహణ

వైసీపీ వచ్చిన కొత్తలో పార్టీ కోసం కష్టపడినవారికి లాభం చేకూర్చాలనే ఉద్దేశంతో లాటరీ నిర్వహణను పూర్వ ప్రజాప్రతినిధి, విజయానందరెడ్డి వర్గానికి చెందిన ఇద్దరికి అప్పగించారు. లాటరీ ద్వారా వచ్చిన సొమ్మును ఇద్దరి అనుచరులు సుమారు 40 మంది నెల నెలా పంచుకునేవారు.

పేకాట స్థావరాల నిర్వహణ

గుడిపాల మండలానికి చెందిన ఓ వైసీపీ నేత పేకాట క్లబ్ నిర్వహించి రూ.లక్షలు సంపాదించారు. అలాగే నగరంలోని ద్వితీయ శ్రేణి నాయకులు శివారు ప్రాంతాల్లో పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకుని స్థాయికి తగినట్లు సంపాదించుకున్నారు. వీరందరికీ పోలీసుల నుంచి ఇబ్బందులు లేకుండా విజయానందరెడ్డి, పూర్వ ప్రజా ప్రతినిధి రక్షణ కల్పించేవారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి అనుచరులపై దాడి

టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అనుచరుల్లో ముగ్గుర్ని ఇటీవల అర్ధరాత్రి విజయానందరెడ్డి అనుచరులు దాడి చేశారు. వారి నుంచి డబ్బుల్ని లాక్కున్నారు. పోలీసులు కూడా బాధితుల మీదే కేసు పెట్టారు.

● మరెన్నో అక్రమాలు

సొంత పార్టీ నేతనే అరెస్టు చేయించారని..!

చిత్తూరు నగరంలోని 50 డివిజన్లలో ఐదారుగురే కర్ణాటక మద్యాన్ని విక్రయించాలని అప్పటి ఓ ప్రజాప్రతినిధితో కలిసి రెండేళ్ల కిందట తీర్మానించారు. వీరి మాటను కాదని విక్రయించే వారిపైకి పోలీసులను దించుతారు. ఇలా అధికారపార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తుండగా, గంగవరం సమీప రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. అతడిని పోలీసులు పట్టుకోవడం వెనుక విజయానందరెడ్డి హస్తం ఉందని విమర్శలు వచ్చాయి.

ఇసుకలో దండుకుని..

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇసుక తవ్వకాలను ప్రైవేటు సంస్థకు అప్పగించింది. అప్పట్లో విజయానందరెడ్డి జీడీనెల్లూరు మండలం నందనూరు రీచ్‌ను తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన దానికంటే అధికంగా ఇసుకను తవ్వేశారు. వందలాది టిప్పర్లతో చెన్నై, బెంగుళూరుకు ఇసుకను అక్రమంగా తరలించారు. రూ.కోట్లు వెనకేసుకున్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో అనుచరుల పాత్ర

చిత్తూరు నగర శివారులోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు వైసీపీ ప్రజాప్రతినిధి, విజయానందరెడ్డి అనుచరులు పట్టాలు తయారుచేసి విక్రయించారు. ఇలా మురకంబట్టు, దొడ్డిపల్లె, ప్రశాంత్‌నగర్, బోడికొండ తదితర ప్రాంతాల్లో ఫోర్జరీ పట్టాలు సృష్టించి ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అమ్ముకున్నారు. ఇటీవల ఓ మహిళకు చెందిన ఇంటి స్థలాన్ని విజయానందరెడ్డి అనుచరుడు ఆక్రమించుకుని.. వారు కట్టిన గోడను కూల్చేశాడు.

ఏం చేశారు?

2019లో వైసీపీ గెలిచాక పూర్తి స్థాయి రాజకీయ నాయకుడిగా మారిపోయిన విజయాందనరెడ్డి ఆర్టీసీ వైస్ ఛైర్మెన్ పదవి తెచ్చుకున్నారు. కానీ, చిత్తూరు బస్టాండును అభివృద్ధి చేయలేదు. కొత్త రూట్లకు బస్సుల్ని వేయలేదు.

విజయానంద ఇంటికి జగన్

2018లో జిల్లాలో విపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్.. ఎస్‌ఆర్‌పురంలోని విజయానందరెడ్డి ఇంటికి వెళ్లారు. జగన్‌తో ఆయనకున్న సంబంధాలకు ఇదో నిదర్శనం. అందుకనే ఎర్రచందనం అక్రమ రవాణా కేసులున్నా ఆయనకు టికెట్ ఇచ్చారని అంటారు.

మంత్రులూ రావాల్సిందే

2019 తర్వాత కొందరు మంత్రులు చిత్తూరుకు వస్తే విజయానందరెడ్డి ఇంటికి వచ్చేవారు. అలాంటి వారిలో అటవీశాఖ మంత్రి కూడా ఉండటం గమనార్హం. తొలినాళ్లలో జిల్లాకు చెందిన ఓ మంత్రినైతే ఆయన జేబులో మనిషిగా చెప్పుకొనేవారు.

విజయానందరెడ్డిపై 12 ఎర్రచందనం, ఒక మద్యం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. వీటిని ఆయన నామినేషన్ సందర్భంగా తన అఫిడవిట్‌లోనూ చూపారు. ఇవన్నీ 2014లో నమోదైనవే.

1. పీలేరు పోలీస్‌స్టేషనులో 39/2014 ఎఫ్ఐఆర్ నెంబరుతో ఒక కేసు నమోదైంది.
2. జీడీనెల్లూరు స్టేషనులో 33/2014 నెంబరుతో..
3, 4. కేవీపల్లె స్టేషనులో 77/2013, 3/2014 నెంబర్లతో రెండు కేసులు
5, 6. బంగారుపాళ్యం స్టేషనులో 35/2014, 74/2014 రెండు కేసులు
7, 8, 9. చిత్తూరు వన్ టౌన్ స్టేషనులో 73/2014, 75/2014, 101/2014 మూడు కేసులు
10. పెనుమూరు స్టేషన్‌లో 58/2014 నెంబరుతో
11. గుడిపాల స్టేషన్‌లో 86/2015 ఎఫ్ఐఆర్ నెంబరు
12. ఎస్‌ఆర్‌పురంలో 78/2014 నెంబరుతో
13. హైదరాబాదులోని సీఐడీ స్టేషనులో 51/2014 మద్యం అక్రమ రవాణా కేసు నమోదైంది.

ఎట్టెట్టా

ఓటు ధర పెంచలా..!

వైసీపీ అధికారంలోకి వచ్చాక కరెంటు, ఆర్టీసీ చార్జీలు బాదేశారు. నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. మరి, ఓటు ధర మాత్రం పెంచలా.. ఇదీ పలువురు ఓటర్ల మాట. మైకుల ముందు ఎవరెన్ని నీతి మాటలు చెప్పినా.. ఓటర్లకు అభ్యర్థులు డబ్బులు పంచడం.. వారు తీసుకోవడం అనేది బహిరంగ రహస్యంగా మారింది. జిల్లాలో 2019 ఎన్నికల సమయంలో పంపిణీ చేసిన మొత్తాన్నే ఈసారీ పంచుతున్నారు. దీంతో అన్ని ధరలు పెరిగిన నేపథ్యంలో ఓటు ధర ఎందుకు పెరగలేదని చర్చించుకుంటున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

'మందు' జాగ్రత్త



మందుబాబులు ముందే జాగ్రత్త పడ్డారు. పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నారు. దీంతో శుక్రవారమే ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఎగబడ్డారు. ఈ రెండు రోజుల సరిపడా బీర్లు, మద్యం బాటిళ్లు తీసుకెళ్లారు. దీంతో చిత్తూరు నగరంలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో శుక్రవారం మధ్యాహ్నానికే స్టాకు అయిపోయింది. దీంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎలైట్ దుకాణం మీద పడ్డారు. అక్కడ వారికి అవసరమైన బ్రాండ్లు లేకపోయినా ఉన్నవాటితో అడ్జస్ట్ అయి తీసుకెళ్లారు. దీంతో ఎలైట్‌లోనూ కాసేపటికే మద్యం ఖాళీ అయిపోయింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి




రివర్స్ గేర్

ఈల్లే రెక్కలు రాలగొట్టేలా వుండారే!

'హోరే ముందెల్లి వోణ్ణి ఆపండ్రా..' అని కార్యకర్తల్ని తోలతా వుండారంట ఆ పార్టీ వోల్లు. 'ఇటుమంటోల్లే మన ఫ్యాను రెక్కలు రాలగొట్టేలా ఉండారే.' అనేసి తెగ గాబరా పడిపోతా వుండారంట. అసలే కరంటు కోతలు. ఫ్యాను పైన ఫ్యాన్లు తిరగడం ల్యా. ఒకటే ఉక్కపోత. ఈ తిరగని ఫ్యాన్లు బయపెడతా వుండాయి అధికారపెచ్చుమోల్లని. ఈ పంపకాలు గతి తప్పి, ఎన్నికల్లో గూడా రెక్కలు ఊడతాయేమోన్న బయం పట్టేసుకుండాది. ఇప్పుడు పంపకాలు జోరుగా సాగతా వుండాయి గదా. మూటలకు మూటలు దిగిపోయి ఓటరుకు నాలుగు ఎయ్యిలు పంచేపని జోరుగా సాగతా వుండాది. అంతా బాగానే ఉండాదిగానీ, పంపకాలకోసరం కాసులు అప్పగించిన నమ్మకస్తులు కొందరు తప్పతాగి రాత్తిరేల ఈదిల్లో పడి, ఎక్కడబడితే అక్కడ తిరగతా వుండారంట. వోల్లకి అప్పగించిన ఏరియా గాకుండా ఇంగో ఏరియాలో తిరిగేస్తూ తెలిసినోల్లు కనిపిస్తే సాలు.. మూటలిప్పి కాసులు పంచేస్తావుండారంట. ఆ పంపకాలు జేస్తున్న మనిసి, తమ ఈదికి లేదా వార్డుకు కేటాయించిన పని సని అప్పటికే గుర్తించేసిన అసలైన ఈదిలోని జనం పోలోమంటా గొడవకు దిగిపోతా వుండారు. బేస్తవారం రేత్తిరి ఇట్టాంటిదే గొడవ జరిగింది కుప్పం మున్సిపాలిటీలో. కొత్తపేట ఏరియాలో ఎక్కడో డబ్బులు పంచాల్సిన మనిషి, మొందుపుల్లుగా కొట్టేసి ఇంకెక్కడో తేలి పంపకాలు మొదలు పెట్టేసినాడంట. ఇది తెలుసుకున్న ఈ ఏరియాలోని జనం తిరగబడినారంట. గొడవ గొడవ అయిపొయ్యింది. అనాక సంగతి తెలుసుకున్న అటుమంటి పంపకాల్లోనే ఉన్న పార్టీవోల్లెవురో గొడవ జరగతా వుండే చోటుకు ఎల్లి, మన మందు వీరుడిని ఎనక్కి తీసుకొచ్చేసినారంట. 'మీరేం కంగారు పడబాకండి. మీ కాసులు మీకు చేర్చే బాధ్యత మాది.' అని జనానికి సర్ది చెప్పేసరికి వాల్ల తల ప్రాణం తోకకొచ్చిందంట. ఇంగ అప్పటికే పంపకాలు జరిగిపోయిన కాసులు ఎవరు తీసుకున్నారో తెలీక సతమతమైపొయ్యినారంట. ఎవరిని అడిగితే ఏ గొడవకొస్తారోనని బయటపడి, 'పోతేపొయ్యినాయి కాసులు, మానం మిగిలితే అంతే జాలు..' అనేసి ఎనక్కొచ్చేసినారంట.

- కుప్పం



● నోట్ దిస్ పాయింట్

ఓటర్లకు డబ్బులు పంచితే..

ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు అభ్యర్థులు డబ్బు ఎరగా వేస్తారు. ఇలా చేస్తే ఐపీసీ 171 (హెచ్) కింద చర్యలు ఉంటాయి. అధికారులకు లంచం రూపంలో డబ్బులు ఇచ్చినా, ఓటర్లకు డబ్బులు పంచినా ఐపీసీ 171(బి) సెక్షన్ కింద చర్యలు తీసుకుంటారు.



బెదిరిస్తే కేసే

ఓటర్లను ఒత్తిడికి గురిచేయడం, బెదిరించడం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఇలా చేసినట్లు రుజువైతే బాధ్యులపై ఐపీసీ 171(సి) చట్టం కింద కేసు నమోదు చేస్తారు.

కానుకల పంపిణీ నేరం

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ కానుకలు పంపిణీ చేయడం నేరం. విందులు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐపీసీ 171 (ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు.



మద్యం సరఫరా చేస్తే..

ఎన్నికలంటే డబ్బు తర్వాత గుర్తుకొచ్చేది మద్యం. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి మూడు సీసాలకు మించి మద్యం తీసుకెళ్లడం నేరం. అలా భారీమొత్తంలో మద్యం తీసుకెళ్తూ పట్టుబడివారిపై అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 34(ఏ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.




- చిత్తూరు కలెక్టరేట్

ఆదర్శం

ప్రభుత్వ భవనాలకన్నీ వారి స్థలాలే

● వితరణగా అందించిన బీవీరెడ్డి కుటుంబం

పులిచెర్ల మండలంలో బీవీ రెడ్డి కుటుంబం.. దాన ధర్మాలకు చిరునామాగా పేరు గడించింది. మండల కేంద్రంలోని తహసీల్దారు.. ఎంపీడీవో కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వాసుపత్రి, గ్రామ పంచాయతీ భవనం, టెలికం కార్యాలయం తదితర భవనాలకు వీరు స్థలాలను విరాళంగా అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించాక ఫర్నిచర్‌నూ ఇచ్చారు. సదుం మండలం బూరగమంద నుంచి అనేక ఏళ్ల క్రితం తన కుటుంబంతో బి.వెంకట్రామిరెడ్డి (బీవీరెడ్డి) పులిచెర్లకు వచ్చి స్థిరపడ్డారు. నూనెమిల్లును ఏర్పాటుచేసి రైతులకు దగ్గరయ్యారు. అనంతరం చాక్లెట్లు తయారుచేసే న్యూట్రిన్ ఫ్యాక్టరీని ప్రారంభించి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. బీవీరెడ్డి పెద్ద కుమారుడు సురేంద్రనాథరెడ్డి హయాంలోనే ప్రభుత్వ భవనాలకు స్థలాలను విరాళంగా అందజేశారు. సురేంద్రనాథరెడ్డి పెద్ద కుమారుడైన మధుసూదన్‌రెడ్డి పారిశ్రామికవేత్తగా కొనసాగుతూ మండల రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. టీడీపీలో కొనసాగారు. 1989లో పులిచెర్ల సింగిల్ విండో ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1996లో ఎంపీటీసీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై.. ఎంపీపీగా పనిచేశారు. 2002లోనూ ఎంపీపీ బాధ్యతలు నిర్వహించారు. 2007లో ఎల్లంకివారిపల్లి ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. శిథిలావస్థలోని దేవళంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మధుసూదన్‌రెడ్డి పునర్నిర్మించారు. 2021 డిసెంబర్ 5న మధుసూదన్ రెడ్డి మృతి చెందారు.



మధుసూదన్‌రెడ్డి

- కల్లూరు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

డీఐజీని కలిసిన ఎస్పీ మణికంఠ

చిత్తూరు : నూతనంగా బాధ్యతలు తీసుకుని చిత్తూరుకు వచ్చిన అనంతపురం డీఐజీ షేము షీబాజ్‌బాయిని ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరుకు విచ్చేసి ఆర్అండ్‌బీలో ఉన్న ఆమెను ఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

గురజాల జగన్మోహన్‌కు పలువురి ప్రముఖుల మద్దతు





ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగు మహిళలు, సంగీత దర్శకుడు దీనాతో గురజాల జగన్మోహన్, మాట్లాడుతున్న బలిజ సంఘం నేతలు

చిత్తూరు సిటీ, మే10: చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు పలువురు ప్రముఖులు మద్దతు తెలిపారు. శుక్రవారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస ప్రసంగీకులు బ్రదర్ సిరాజ్ గురజాలను మర్యాద పూర్వకంగా కలసి మద్దతు తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకులు దీనా గురజాలను కలసి మద్దతు తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు సోదరుడి కుమారుడు నారా గిరీష్ టీడీపీ నేతలతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నగరంలోని చర్చివీధి, బజారువీధి ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్ మనోహర్, ఆర్ గాంధీ, ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్, పార్టీ ఎన్నికల పరిశీలకులు సునీల్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాల వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి గురజాల సందీప్, నేతలు మోహన్‌రాజ్ తదతరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన ర్యాలీ

గురజాల జగన్మోహన్‌కు మద్దతుగా ఆయన సతీమణి ప్రతిమ తెలుగుమహిళలతో కలసి నగరంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం, ఎమ్మెస్సార్ సర్కిల్, దర్గా సర్కిల్, మార్కెట్ చౌక్, చర్చివీధి, హైరోడ్డు, కట్టమంచి, దొడ్డిపల్లి, మురకంబట్టు ప్రాంతాల్లో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, నియోజకవర్గ అధ్యక్షురాలు రాణి, నగర అధ్యక్షురాలు వరలక్ష్మి, లలిత, భార్గవి పాల్గొన్నారు.

బలిజ సంఘంనేతల మద్దతు

ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు తమ మద్దతుగా బలిజ సంఘంనేతలు చెప్పారు. జీజేఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం జగన్ బలిజలను బలిపశువులను చేశారన్నారు. తాను అధికారంలోకి వస్తే బలిజ సంక్షేమానికి రూ.10 వేల కోట్లు కేటాయిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని చెప్పారు. కార్యక్రమంలో బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓయం రామదాసు, నేతలు బాలాజి, తులసీరామ్, నరసింహులు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

గంగాధరనెల్లూరు, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, చిత్తూరు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలతోపాటు ఎన్నికల సామగ్రిని పోలింగ్ డ్యూటీలకు వెళ్ళే అధికారులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. గంగాధరనెల్లూరు హైస్కూల్‌లోని వేర్వేరు కౌంటర్ల ఏర్పాటు కోసం శుక్రవారం ఉదయం నుంచే ప్రైవేట్ కాంట్రాక్ట్ సిబ్బంది గ్రిల్స్ ఏర్పాటు చేసి షామియానాలు కట్టే పనిలో బిజీగా ఉన్నారు. అదేవిధంగా డెస్కులు, కుర్చీలను హైస్కూల్ తరలించారు. కాగా ఆదివారం పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేవారికి ఈవీఎంలతో పాటు ఎన్నికల స్టేషనరీని అందించడానికి అధికారులను, సిబ్బందిని సుమారు 300మందిని నియమించినట్లు తెలిసింది. అదేవిధంగా ఈనెల 12న గంగాధరనెల్లూరు హైస్కూల్ నుంచి ఈవీఎంలతో పాటు పోలింగ్ సామాగ్రిని తీసుకెళ్ళి ఈనెల 13వతేది సోమవారం పోలింగ్ విధులు నిర్వహించడానికి గాను మొత్తం 2200మందిని నియమించగా వారిలో పోలింగ్‌కేంద్రాలకు 306మంది పీవోలు, 306మంది ఏపీవోలు, 1218మంది ఓపీవోలు, 50మంది మైక్రో అబ్జర్వర్‌లు, 256మంది వీడియోగ్రాఫర్లు, 33మంది సెక్టోరల్ ఆఫీసర్లు, 33మంది రూట్ ఆఫీసర్లను ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి గాను 70 బస్సులు ఏర్పాట్లు చేసినట్లు అధికారుల ద్వారా తెలిసింది.

వైసీపీ ప్రచారంలో టీటీడీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి



కార్వేటినగరం, మే 10: కార్వేటినగరంలో గురువారం వైసీపీ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో టీటీడీలో విజిలెన్స్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. కార్వేటినగరం పంచాయతీకి చెందిన విజయ్‌కుమార్ గ్రామ వలంటీర్‌గా కూడా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం పట్ల ప్రతిపక్ష పార్టీలు భగ్గుమంటున్నాయి. ప్రచారంలో పాల్గొన్న విజయ్‌కుమార్‌పై జిల్లా ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాట్లపై సమీక్ష

చిత్తూరు, మే 10: నగరపాలక పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను సత్వరం పూర్తి చేయాలని ఏఆర్వో, కమిషనర్ అరుణ ఇంజనీరింగ్, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో బారికేడ్లు, షామియానాల ఏర్పాట్లు, విద్యుద్దీకరణ, ఫ్యాన్ల పనితీరు చెక్ చేసుకోవాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజారోగ్య అధికారులు, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులతో మాట్లాడారు. ఎంఈ గోమతి తదితరులు పాల్గొన్నారు.

'జగన్ దళిత ద్రోహి'

గుడిపాల, మే 10: ముఖ్యమంత్రి జగన్ దళితద్రోహి అని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి, రాష్ట్ర దళిత ప్రజావేదిక అధ్యక్షుడు ధనుంజయరావు అన్నారు. శుక్రవారం గుడిపాలలో వారు మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీకి కేటాయించిన నిధులను కూడా దోచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన పాలనలో అరాచకాలు, దళితులపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు తప్ప దళితులకు చేసిందేమీ లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు అవుతారని, ఆయన పాలనలోనే దళితులకు సముచిత స్థానం చేకూరుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఏపీ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్, దళితనాయకులు గోపి, ధనసింగ్, రాజామణి, రజనీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తి పలకండి

మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్



టీడీపీలో చేరిన పెరుమాళ్ళపల్లికి చెందిన యువకులు

బంగారుపాళ్యం, మే 10: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ప్రజల చేతుల్లోనే ఉందని, వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికి సమర్థవంతులైన పాలకులను ఎన్నుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోవర్ధనగిరి, బండ్లదొడ్డి, రాగిమానిపెంట, గుంతూరు, ఎర్రాండ్లపల్లి, ముంగరమడుగు, జంబువారిపల్లె, పెరుమాళ్ళపల్లి తదితర గ్రామాల్లో ఆయన టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అంతకుముందు మండల పార్టీ కార్యాలయంలో బంగారుపాళ్యం పంచాయతీ ఊటువంక గ్రామానికి చెందిన దళిత యువకులు జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ నుండి టీడీపీలోకి చేరారు. అలాగే పెరుమాళ్ళపల్లి పంచాయతీకి చెందిన 20మంది యువకులు వైసీపీ నుండి టీడీపీలోకి చేరారు. పార్టీలో చేరినవారికి మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్రనాయుడు, ఎన్‌పీధరణీ నాయుడు, జనార్దన్ గౌడ్, రమేష్, రవి, నాసీర్ ఖాన్, హరిప్రసాద్, హరిబాబు, గిరిబాబు, సుదర్శన్ నాయుడు తదితరులు ఉన్నారు.

రానున్న 48 గంటలు కీలకం : జేసీ



అధికారులకు సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 10: ఎన్నికల పోలింగ్ జరిగే ఈనెల 13వ తేదికి ముందు 48 గంటలు అత్యంత కీలకమని, మరింత అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, జేసీ శ్రీనివాసులు అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని జేసీ మీటింగ్ హాలులో నియోజకవర్గస్థాయి అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టరేట్‌లోని జేసీ మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న 45 గంటలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నగదు, ఇతరత్రా ఉచితాల పంపిణీపై గట్టి నిఘా ఉంచాలని చెప్పారు. హింసకు ఏమాత్రం అవకాశం లేకుండా శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. ఆర్వో నుంచి అనుమతి పొందిన అభ్యర్థుల వాహనాలను సైతం తప్పక తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలోని 113 మద్యం దుకాణాలు, బార్‌లు, రెస్టారెంట్లను శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఎన్.ఆర్.పేట, గుడిపాల, ముత్తరసికుప్పం, గొల్లమడుగు చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, ఇతర ప్రాంతాల నుంచి మద్యం, నగదు లాంటివి రాకుండా అడ్డుకోవాలన్నారు. పోలింగ్ రోజు శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా 29రూట్ మొబైల్ పోలీసు ఫోర్స్ అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రతి కేంద్రం వద్ద ముగ్గురు, సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసుతో పాటు ఐదుగురు సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది ఉంటారన్నారు. ఈ సమావేశంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, ఎంపీడీవోలు, సీఐలు, ఎస్ఐలు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆరాచక పాలనను అంతం చేయాలి

శ్రీరంగరాజపురం, మే10: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అవినీతి, ఆరాచక పాలనను అంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శుక్రవారం వేణుగోపాలపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలకు రెండు ఓట్లను సైకిల్ గుర్తుపైనే ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు టీం సభ్యులు, నీరంజన్‌రెడ్డి, సిద్దయ్యశెట్టిచ భూపతిరెడ్డి హేమాద్రి యాదవ్, బాలాజీ నాయుడు, ఎన్ఆర్ఐ సభ్యులు పాల్గొన్నారు.

ఎలా ఓటు వేయాలో అవగాహన

విజయపురం, మే 10: విజయపురంలో శుక్రవారం టీడీపీ ప్రచారం జోరుగా సాగింది. టీడీపీ తీర్థం పుచ్చుకున్న లక్ష్మీపతిరాజు పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎం మోడల్ నమూనాతో ఎలా ఓటు వేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిది చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, తెలుగు యువత మురళి, ప్రవీణ్‌రాఘరాజు, శివకుమార్, సురేష్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు రిపోర్టులు పంపండి : జేసీ

చిత్తూరు, మే 10: పోల్‌డే మేనేజ్‌మెంట్ సిస్టం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో సెక్టోరల్ అధికారులు కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. 12న ఉదయం 7 గంటలకు డిస్పాచ్ సెంటర్ అయిన పీవీకేఎన్ డిగ్రీ కళాశాలకు చేరుకుని పీవో, ఏపీవో, ఓపీవోలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు 13వ తేది 4 గంటలకెల్లా పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బందిని సిద్ధం చేసి ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలన్నారు.

నేటి సాయంత్రం 6 గంటల వరకే ప్రచారాలు

నియోజకవర్గ పరిధిలో శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రచారాలు నిర్వహించుకోవాలని జేసీ చెప్పారు. డిగ్రీ కళాశాల ఆవరణంలో శుక్రవారం పోటీలోని అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం జరిగింది. 13న పోలింగ్ రోజు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లు మాత్రమే పోలింగ్ కేంద్రంలో ఉండేందుకు అనుమతిస్తామని, స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లు కేంద్రం బయట ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఓటర్లు, 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీలు ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కేసు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏకపక్షంగా టీడీపీ సానుభూతిపరులపై బైండోవర్ కేసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 10: ఆరు నెలలుగా రాజకీయ కక్షతో పాలకపార్టీ నాయకుల సూచనల మేరకు ఇష్టారాజ్యంగా టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు పెట్టి పోలీసులు భయభ్రాంతులు సృష్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి వి. సురేంద్ర కుమార్ తదితరులు ఆరోపించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో వారు ఈ మేరకు కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలుకు ఫిర్యాదు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో టీడీపీ సానుభూతిపరులు ఏజెంట్లుగా రాకూడదన్న కారణంతో పోలీసులపై ఒత్తిడి తెచ్చి బైండోవర్ కేసులు పెట్టించారని పేర్కొన్నారు. చిత్తూరు అసెంబ్లీ పరిధిలో 226 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి ఇద్దరు లేదా ముగ్గురు సానుభూతిపరులు, కార్యకర్తలపై అన్యాయంగా బైండోవర్ కేసులు పెట్టించారని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ అట్టివాటిపై పరిశీలన చేస్తామని, బైండోవర్లపై భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు పొందిన అభ్యర్థికి టీడీపీ ఏజెంట్లుగా తమవారు కూర్చొనేందుకు అనుమతి ఇవ్వాలని వారు కలెక్టర్‌ను కోరారు. బీజేపీ నాయకుడు అట్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం కుప్పంలో ఆస్పత్రి వద్ద జరిగిన చిన్న ఘటనపై పోలీసులు అనవసరంగా అరెస్టులు చేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ సమాధానమిస్తూ తప్పతాగి జరిగిన ఘటనను రాజకీయం చేయరాదని, ఇందుకు సంబంధించి పూర్తి వీడియో తన వద్ద ఉందని సమాధానమిచ్చారు. పోలింగ్ రోజు వృద్ధులను పోలింగ్ కేంద్రాల ప్రహరీ వరకు సొంతవాహనాల్లో వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

గత హామీల ఊసేది జగన్?

మండే ఎండలో చప్పగా ముగిసిన సీఎం ప్రచార సభ

పుత్తూరు అర్బన్, మే 10: పుత్తూరులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన సీఎం జగన్ సభలో ఆయన ప్రసంగంలోనూ, మంత్రి రోజా ప్రసంగంలోనూ నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేస్తామనే విషయాన్ని స్పష్టం చేయకపోవడంపై వైసీపీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. రోజా తాను ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసేశానని చెప్పుకోవడం తప్ప ప్రత్యేకించి ఫలానా అభివృద్ధి చేశాననే అంశాన్ని ప్రస్తావించకపోవడం పట్ల కూడా ఆ పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో పాటు జగన్ తన ప్రసంగంలో గత ఎన్నికల సందర్భంగా ఇదే కూడలిలో నిర్వహించిన సభలో ఇచ్చిన హామీలను కూడా ప్రస్తావించలేదు. గాలేరు-నగరి ప్రాజెక్టులో అంతర్భాగమైన వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు గాజుల మండ్యం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తానని గత ఎన్నికల సందర్భంగా పుత్తూరులో జరిగిన సభలో జగన్ వాగ్దానం చేశారు. తిరిగి అధికారంలోకి వస్తే వాటిని నెరవేరుస్తామని కూడా ఆయన చెప్పకపోవడం వైసీపీ వర్గాలనే అసంతృప్తికి గురి చేసింది. సీఎం షెడ్యూల్ ప్రకారం 45 నిమిషాల పాటు ప్రసంగించాల్సి ఉంది. జగన్ ప్రసంగం ప్రారంభంకాగానే ఎండవేడిమికి తాళలేక పలువురు వెనుదిరగడం కనిపించింది. దీంతో ప్రసంగ సమయాన్ని 30నిమిషాల్లోనే పూర్తి చేశారు.

పింఛన్ కట్ బెదిరింపు....

ఇదిలా ఉండగా సీఎం జగన్ సభ విజయవంతానికి వైసీపీ నాయకులు తీవ్ర కసరత్తే చేశారు. వడమాలపేట మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి పింఛన్ కట్ చేస్తామని బెదిరించి మరీ సభకు బలవంతంగా తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు వలంటీర్లను వినియోగించినట్లు సమాచారం. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.ట్రాఫిక్ ఆంక్షలు ఉండడంతో సభా ప్రాంగణానికి వచ్చేందుకు కిలోమీటర్ పైన నడవాల్సి వచ్చింది.

ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు

జగన్ రావడానికి రెండున్నర గంటల ముందు నుంచే పుత్తూరులో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. పుత్తూరు పట్టణం కాపువీధి జంక్షన్‌లో సభ పెట్టడంతో చిత్తూరుకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు చిత్తూరు నుంచి వచ్చేవారు కూడా వినాయకపురం మీదుగా కనకంపాలెం, మిద్దిగుంట రోడ్డు మార్గంలో పుత్తురుకు రావాల్సి వచ్చింది. 10 నిమిషాల ప్రయాణం గంటన్నర పట్టింది. తిరుపతి-పుత్తూరు మార్గంలో కూడా పోలీసులు అంక్షలు పెట్టడంతో వాహనదారులు అగచాట్లు పడ్డారు. బైపాస్‌రోడ్డులోనే బస్సులు, కార్లు నిలిపివేయడంతో పున్నమి సర్కిల్ నుంచి కాలినడకనే పుత్తూరులోకి రావాల్సి వచ్చింది. నగరి నుంచి వచ్చేవారిని కూడా నారాయణవనం బైపాస్ సర్కిల్‌లో నిలిపివేయడంతో ఆటోలపై ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జగన్ పర్యటన నేపథ్యంలో సభ సమీప ప్రాంతాల్లో దాదాపు గంట సమయం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తీవ్రమైన ఎండ వేడితో సమీపంలోని ఇళ్లలో నివసించే ప్రజలు అల్లాడిపోయారు. సీఎం సభలో కొందరు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు.



జగన్ అభివాదం

నిరూపిస్తే వదిలి వెళ్లిపోతాం: రోజా

తన అన్నలు ఎక్కడ దోచుకున్నారో చెబితే ఇక్కడ (నగరి నియోజకవర్గం) నుంచి వదిలి వెళతామని సభలో మంత్రి రోజా సవాల్ విసిరారు.చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, గాలి భానుప్రకాష్.. తనను రాజకీయంగా ఎదుర్కొనలేకే ఇలా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.14 కోట్లు



ఐరాల(కాణిపాకం), మే 10: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,14,63,904 లభించినట్లు ఈవో వెంకటేశు వెల్లడించారు. ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం స్వామి కానుకలను ఈవో పర్యవేక్షణలో లెక్కించారు. 591 యూఎస్ఏ, 40 ఆస్ట్రేలియా డాలర్లు, 25 యూఏఈ దిర్హామ్స్, 25 యూరోలు, 5సౌదీ రియాల్స్ లభించినట్లు ఆయన వివరించారు. 21 రోజులలో ఈ ఆదాయం లభించినట్లు తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మల్లికార్జున పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు కట్టుదిట్టమైన భద్రత

చిత్తూరు కలెక్టరేట్, మే 10: ఓట్ల లెక్కింపు కోసం ఎంపిక చేసిన ఎస్వీసెట్ (శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల)లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఎస్వీసెట్‌లో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లను, రిసెప్షన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రవేశించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరే ప్రక్రియ గురించి అధికారులకు పలు సూచనలిచ్చారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, పూతలపట్టు ఆర్వో చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య కలెక్టర్ వెంట ఉన్నారు.

కర్ణాటక నుంచి పత్రపల్లె మీదుగా వస్తున్న కారులో రూ. 10.3 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఏసీబీ సూపరింటెండెంట్ రవి తెలిపారు. బెంగళూరుకు చెందిన రాజారెడ్డి రాజుపేటలోని తన కుమార్తె వద్దకు కారులో వస్తుండగా పత్రపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీలో నగదు పట్టుబడింది. సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తా



టీడీపీ అభ్యర్థి మురళీమోహన్‌ను సన్మానిస్తున్న యువకులు

యాదమరి, మే 10: ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకోవడంతో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. నాయకులతో కలిసి ఆయన మండలంలోని కీనాటంపల్లె, సంతగేటు, 14 కండ్రిగ, సామిరెడ్డిపల్లె, చిన్నంపల్లె, మార్లబండ, పెరుమాళ్లపెంట, 155 కమ్మపల్లె, కాశిరాళ్ళ, దాసరాపల్లె గ్రామాల్లో పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు జనార్ధనరావు, మండల పార్టీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రబి, నేతలు సుభాష్ నాయుడు, కుమార్, హేమగిరి, రాజమాణిక్యం, నిత్యానందం, అమరనాథనాయుడు, చిత్ర, తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె : పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌ను, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావులకు ఓటు వేసి గెలిపించాలని మండల టీడీపీ నేతలు కోరారు. శుక్రవారం మండలంలోని జి.గొల్లపల్లె, గురుకువారిపల్లె, పత్రపల్లె తదితర గ్రామాల్లో టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, స్థానిక టీడీపీ నాయకుడు రఘురామచౌదరి, మురళీలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన





ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న శాంతి రెడ్డి, ఎస్ఆర్ఆర్ కండ్రిగలో ప్రచారం చేస్తున్న బీమనేని తదితరులు

కార్వేటినగరం, మే 10: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ భార్య శాంతిరెడ్డి శుక్రవారం కార్వేటినగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జగన్నాథం, మండల బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్, మండల ఉపాధ్యక్షురాలు సెల్వి పాల్గొన్నారు.

పాలసముద్రం : టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావును గెలిపించాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు కోరారు. శుక్రవారం మండలంలోని ఎస్.ఆర్.ఆర్. కండ్రిగ, కృష్ణజిమ్మాపురం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వాసునాయుడు, శేఖర్‌రాజు, ప్రభాకర్‌రాజు, మాధవరాజు, లోకనాథ నాయుడు, జానకిరామనాయుడు, జె.విజయ్ కుమార్, వాసు యాదవ్, సాంబశివన్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం : గంగాధరనెల్లూరు తెలుగుదేశం(కూటమి) పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుల విజయమే లక్ష్యమని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్ అన్నారు. శుక్రవారం వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో కూటమి శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ క్రమంలో టీడీపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓట్లేయ్యాలని విజ్ఞప్తి చేశారు.



బొమ్మయ్యపల్లెలో కరపత్రాలిస్తున్న శేషాద్రికుమార్

వైసీపీ నేత షెడ్డులో మద్యం పట్టివేత



వి.కోట, మే 10: మండలంలోని కొంగాటం పంచాయతీ క్షీరసాగరానికి చెందిన వైసీపీ నేత జయరామిరెడ్డి మల్బరీ షెడ్డులో 12 కేసుల మద్యం పట్టుబడింది. రహస్య సమాచారం మేరకు స్పెషల్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న శుక్రవారం రాత్రి జయరామిరెడ్డి మల్బరీ షెడ్డులో సోదాలు చేశారు. ప్లాస్టిక్ సంచిలో మద్యాన్ని గుర్తించారు. అనంతరం ఆయన ఇంట్లో సోదాలు చేసేందుకు ప్రయత్నించగా అనుచరులు, మండల ముఖ్యనేత వారిని బెదిరించారు. రక్షణ కోసం వారు పోలీసులను ఆశ్రయించారు. పట్టుబడిన 12 కేసుల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. అయితే అధికార నేతలపై కేసులు లేకుండా చూసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

నగదు పట్టివేత

కర్ణాటక నుంచి పత్రపల్లె మీదుగా వస్తున్న కారులో రూ. 10.3 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఏసీబీ సూపరింటెండెంట్ రవి తెలిపారు. బెంగళూరుకు చెందిన రాజారెడ్డి రాజుపేటలోని తన కుమార్తె వద్దకు కారులో వస్తుండగా పత్రపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీలో నగదు పట్టుబడింది. సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిర్భయంగా ఓటేయండి



చిత్తూరు, మే 10: ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటేయాలని, పోలీసులు అండగా ఉంటారని ఏఎస్పీ ఆరీఫుల్లా కోరారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనుండడంతో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా శుక్రవారం కేంద్ర బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజల్లో భయాందోళనలు పోగొట్టేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని ఏఎస్పీ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి అండగా నిలవాలి : దగ్గుమళ్ల





రామకుప్పం రోడ్‌షోలో అభివాదం చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు - కుప్పంలో ప్రచారం చేస్తున్న దగ్గుమళ్ల

రామకుప్పం, మే 10: రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలంతా టీడీపీని ఆదరించాలని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. శుక్రవారం ఆయన రామకుప్పంలో రోడ్‌షో నిర్వహించారు. అంతకుముందు గడ్డూరు గ్రామంలో దళితులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి జరగకపోగా అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని విమర్శించారు. వైసీపీ ఒఅధికారంలోకి వచ్చాక ఎస్సీలకు సంబంధించి 27పథకాలను ఆపేశారని వివరించారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా చంద్రబాబును, ఎంపీగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

ఓటర్లు ఇప్పటికే నిర్ణయం తీసేసుకున్నారు

కుప్పం : ఓటర్లు తమ ఓటు ఎవరికి వేయాలో ఇప్పటికే నిర్ణయం తీసేసుకున్నారని, కచ్చితంగా సైకిల్ గుర్తుపైనే పడుతుందని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. కుప్పం మున్సిపాలిటీలోని 23, 24 వార్డుల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ప్రజల్లోకి బలంగా వెళ్లిందని, వైసీపీ మేనిఫెస్టో తుస్సుమందని ఎద్దేవా చేశారు. కుప్పంలో చంద్రబాబు, చిత్తూరు పార్లమెంటు స్థానంలో తాను అత్యధిక మెజారిటీతో గెలువబోతున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలపై చేసిన దాడులు, సాగించిన అరాచకాలు ఇందుకు దోహదం చేశాయని చెప్పారు.



రామకుప్పంలో ప్రచారం